నేడు TELUGU DAILY
విలేకరులు కావలెను
అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.
9346984911
9133445456

సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY

గురువారం | 02.04.2026 | సంపుటి : 3 | సంచిక :341 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com



మెరిసిన రిజ్వీ.. మురిసిన ఢిల్లీ 08



## దేశంలో చమురు రెండు నెలలకు
# సరిపడా ఉంది

**ప్రధాని మోదీ అధ్యక్షతన సీసీఎస్ సమావేశం**

**ఇంధన సరఫరాలు, ఎరువుల లభ్యత, భద్రత వంటి కీలక అంశాలపై చర్చ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల కేబినెట్ (సీసీఎస్) సమావేశం జరిగింది. ఈ భేటీలో ప్రధాని మోదీతో పాటు రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్,హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌లు పాల్గొన్నారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం తీవ్రతరమవుతున్న నేపథ్యంలో ఇంధన సరఫరాలు, ఎరువుల లభ్యత, భారతీయుల భద్రత వంటి కీలక అంశాలపై చర్చ జరిగింది. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్‌లో యుద్ధం ప్రారంభమైంది.

ఢిల్లీ: అప్పటి నుంచి పశ్చిమ ఆసియా ప్రాంతంలో పరిస్థితులు మరింత క్లిష్టంగా మారాయి. ఈ నేపథ్యంలో కేంద్రం మూడోసారి సీసీఎస్ సమావేశం నిర్వహించింది. గత సమావేశాల్లో అంతర్జాతీయ పరిస్థితులు, ఇంధన సరఫరాలపై తీసుకున్న చర్యలను సమీక్షించారు. ప్రభుత్వం తెలిపిన ప్రకారం దేశానికి ప్రస్తుతం 60 రోజుల క్రూడ్ ఆయిల్ నిల్వలు ఉన్నాయి. మొత్తం నిల్వ సామ-ర్థ్యం 74 రోజులు. పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎటువంటి పెరుగుదల లేదు. ఎల్‌పీజీ ధరలు కూడా పెంచలేదు. ఈ ఏడాది ఖరీఫ్ కోసం తగినంత విత్తనాలు, ఎరువులు

-మిగతా 2 లో..



# నేటి నుంచి భూభారతి

## ఇక నుంచి భూ వివాదాలకు చెక్

**ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం**

**అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**

తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి.

హైదరాబాద్, ఏప్రిల్ 1 : ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు . ఈ సందర్భంగా భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా అమలు చేస్తున్నామని

-మిగతా 2 లో..





ప్రపంచానికి ఒరాకిల్
## భారీ కుదపు

- 30వేల మంది టెక్కీల తొలగింపు
- అందులో 12వేల మంది భారతీయులు

08



## జిఎస్టీ వసూళ్లలో 8,8శాతం వృద్ధి

మార్చిలో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు 08



## ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు

వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ

07




08

## భారీ లాభాల్లో స్టాక్‌మార్కెట్లు

## సిఐడి విచారణ జరిగితే
# తేలేదేమీ ఉండదు

**మంత్రి పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం**

**కడియం ఏ పార్టీలో ఉన్నాడో తెలపాలన్నాం**

**ఇవన్నీ అడిగితే కేసులతో వేధింపులా**

**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

హైదరాబాద్, ఏప్రిల్ 1 : రాష్ట్రంలో జరిగే మైనింగ్ స్కామ్‌ను హరీశ్‌రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. మైనింగ్ స్కామ్ మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. హౌస్ కమిటీ వేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సమస్య అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దీనిపై

-మిగతా 2 లో..



## నేరుగా
# ఖాతాల్లోకే జీతాలు

**కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు**

**వేలాది మంది ఉద్యోగులకు లబ్ది చేకూరే అవకాశం**

తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి.

హైదరాబాద్, ఏప్రిల్ 1 : దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ

-మిగతా 2 లో..



## ఆరు గ్యారెంటీలపై నిలదీయండి

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు**

హైదరాబాద్, ఏప్రిల్ 1 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో 6 గ్యారంటీల అమలులో అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిపై నిరసన తెలుపుతూ నిలదీయాలని

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 125 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 152 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 220 (కిలో) |
| స్కిన్ లెస్ | 251 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹62

## రెండు పంచాయతీలకు
# వికాస్ పురస్కారాలు

**హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 : గ్రామీణాభివఅద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తెలంగాణ పంచాయతీలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు' రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలను వరించాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి

-మిగతా 2 లో..



## అమరావతి బిల్లుకు
# లోక్‌సభ ఆమోదం


**సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్**

**చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపిలు**

**ఏకగ్రీవంగా ఆమోదించిన సభ**

**వైకాపా సభ్యుల వాకౌట్**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 : ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును -మిగతా 2 లో..





## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య 02

**5లక్షలు ఇచ్చామని చెప్పి 15లక్షలు తొలగించే కుట్ర**

**ప్రభుత్వ తీఈరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత**

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉ ంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం,





భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్‌అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.

## దేశంలో రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. వ్యవసాయ ఇన్‌పుట్స్‌లో ఎటువంటి కొరత లేదని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ ధరలు పెరిగినా, దేశీయ విమాన ప్రయాణ ఖర్చులు పెరగకుండా ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకుంది. గల్ఫ్ ప్రాంతం నుంచి ఇప్పటివరకు 5.98 లక్షల మంది భారతీయులు తిరిగి వచ్చారు. ప్రస్తుతం 485 మంది భారతీయ నావికులు పర్షియన్ గల్ఫ్‌లో ఉన్నారు. వారందరూ సురక్షితంగా ఉన్నారని ఓడరేవులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ తెలిపింది. గల్ఫ్ ప్రాంతంలో చదువుతున్న భారతీయ విద్యార్థుల విద్యా సంవత్సరం అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటించింది. ఇరాన్‌పై అమెరికా యుద్ధ ప్రభావం దేశంపై నేరుగా పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇంధన నిల్వలు, ఎరువుల లభ్యత, విద్యార్థుల భద్రత వంటి అంశాలను సమగ్రంగా సమీక్షించడం ద్వారా ప్రజలకు నమ్మకం కల్పించడానికి ప్రయత్నిస్తోంది.

## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

(మొదటిపేజీ తరువాయి)

శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ది చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ్గ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే పక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టా÷–గ్గ÷ట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

## రెండు పంచాయితీలకు వికాస్ పురస్కారాలు

(మొదటిపేజీ తరువాయి)

చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో జాతీయ అవార్డును దక్కించుకోగా, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో అత్యుత్తమ పురస్కారాన్ని సాధించింది. గ్రామ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడం , మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన , మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది , గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచి జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తిని చాటాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.



## అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక

**రాజధానిపై ఉన్న సందిగ్ధతకు ఇక తెరపడినట్లే**

**ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు హర్షం**

**అమరావతి, ఏప్రిల్ 1 :** లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు తెరపడిందన్నారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయని సోషల్ మీడియా ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం అన్నారు. ఈరోజు లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. గత పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయి, అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని సీఎం పేర్కొన్నారు. రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇదన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయన్నారు. అమరావతి ఇక అజేయం.. అజరామరం అని అన్నారు సీఎం. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతామని స్పష్టం చేశారు. సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## మంత్రి పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

(మొదటిపేజీ తరువాయి)

సీఐడీ ఎంక్వైరీ వేస్తామని ప్రభుత్వం చెబుతోందని.. మంత్రి మీద సీఐడీ ఎంక్వైరీ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. మంత్రిని సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని పాడి కౌశిక్ రెడ్డి అడిగారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అయితే దానం నాగేందర్; కడియం శ్రీహరితో ముఖ్యమంత్రి మాట్లాడించారని చెప్పారు. దానం నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని తెలిపారు. అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్‌ను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకే నువ్వు ఏ పార్టీలో ఉన్నావని కడియం శ్రీహరిని అడిగామని తెలిపారు. తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరూ అడిగారని,ఇది తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావని ప్రశ్నించాం.. అది తప్పా అని ప్రశ్నించారు. నువ్వు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావని కడియం శ్రీహరిని అడిగామన్నా రు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు తనను టార్గెట్ చేశారని అన్నారు. నిరుద్యోగుల పక్షాన ఉద్యోగాలు అడిగినందుకు టార్గెట్ చేస్తున్నావా అని ప్రశ్నించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నిస్తే టార్గెట్ చేస్తున్నావా అని నిలదీశారు. ప్రజల కోసం పోరాడుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతల తిట్లు కనిపించవా అని ప్రశ్నించారు. దానం తిట్లు ఎథిక్స్ కమిటీకి రావా అని అడిగారు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన బూతులు అందరూ చూశారని తెలిపారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉంటే కేసీఆర్, హరీశ్‌రావును ఎందుకు విమర్శించారని ప్రశ్నించారు. హామీలపై మేం ప్రశ్నిస్తే మమ్మల్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని బయటపెడితే ప్రభుత్వం స్పందించడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మండిపడ్డారు. మైనింగ్‌పై జరుగుతున్న అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. సభాసంఘం వేయాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. నిజమైన నాయకులంటే పార్టీ లైన్‌లో ఉండాలి.. కానీ పార్టీ మారిన మనిషిని మీ భుజాల మీద ఎత్తుకుంటున్నారని మండిపడ్డారు.. తోటి శాసనసభ్యుడిని తిట్టేందుకు మంత్రులకు మైక్‌లు ఇచ్చారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు ఒక్కరైనా స్జబెక్ట్ మాట్లాడారా అని ప్రశ్నించారు. స్వర్ణకారుల కష్టాల గురించి ఒక్కరైనా మాట్లాడారా అని అడిగారు. అవినీతి మంత్రిని, పార్టీ మారిన వ్యక్తిని వెనుకేసుకొచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే మా వెనుకాల కూర్చోవాలి కదా అని ప్రశ్నించారు. కడియం శ్రీహరి వంటి నాయకుడి మీరు వెనుకేసుకొస్తారా అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి ఏ పార్టీ అని మేం తప్పకుండా అడుగుతామని తెలిపారు. తొలిసారి అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలు రాజ్యాంగ విలువలు కాపాడాలని సూచించారు. అసెంబ్లీలో చర్చ చూసి పిల్లలు నవ్వుకుంటున్నారని అన్నారు. సభలో పాలసీల గురించి మాట్లాడుతున్నామా? అని అడిగారు. మనం చర్చించాల్సింది ప్రజల సమస్యల గురించి మాత్రమే అని స్పష్టం చేశారు.

## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

**హైదరాబాద్, ఏప్రిల్ 1 :** రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత సీరియస్ అయ్యారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం



పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## భూ వివాదాలకు చెక్

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, భూధార్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక్క క్లిక్‌తో రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు పొందవచ్చని చెప్పారు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా.. వాటి గందరగోళానికి చెక్?పెడుతూ భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు.

## ఆరు గ్యారెంటీలపై నిలదీయండి

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు పార్టీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముందుగా 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లయినా ఇంతవరకు అమలు చేయకుండా మోసం చేస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వేలో బూత్ స్థాయి కార్యకర్తలు బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికి వెళ్లి బోగస్ ఓటర్లను ఏరి వేయడంలో సహకరించాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రాబోయే రోజుల్లో ఎప్పుడైనా వచ్చే అవకాశమున్నందున పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## చంద్రబాబు కృషి వల్లనే అమరావతి సాకారం

**రైతుల పక్షాన చంద్రబాబుకు మంత్రి నారాయణ కృతజ్ఞతలు**

**జగను కుతంత్రాలకు ఇక సాగవన్న మంత్రులు**

**అమరావతి, ఏప్రిల్ 1 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి కృషి వల్లే రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభలో ఆమోదం పొందిందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. అమరావతి రైతుల తరఫున సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందినందుకు ప్రధాని మోదీకి సైతం ధన్యవాదాలు తెలియజేశారు. బుధవారం రాజధాని బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ నేపథ్యంతో అమరావతిలో మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతిపై పోరాడి విజయం సాధించిన రైతులకు అభినందనలు తెలిపారు. అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా పేరు పేరునా మంత్రి నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి అజేయం.. ఇకపై ఎవ్వరూ ఒక్క ఇంచు కూడా అమరావతిని కదల్చలేరని ధీమా వ్యక్తం చేశారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి నారాయణ స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా ఐదేళ్లపాటు మూడు ముక్కలాట ఆడిందంటూ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని రాష్ట్ర రాజధానిగా శాసనసభలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక ఉద్యోగం కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 14 వేల ఉద్యోగాలు ఇచ్చిందని మంత్రి ఆనం వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో కొలువుదీరిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీన క్రమం తప్పకుండా పెన్షన్ పంపిణీ చేస్తోందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్ లబ్దిదారులకు నెలకు రూ.4 వేల చొప్పున నగదు అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ దొంగ నాటకాలను గుర్తించి.. తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. లోక్‌సభలో రాజధాని అమరావతి బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో బుధవారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ఏపీ రాజధానిగా అమరావతిని రాష్ట్ర ప్రజలంతా ఆమోదించారన్నారు. 33 వేల ఎకరాల భూములను రైతులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా ఇచ్చారని తెలిపారు. ఆనాడు జగన్ అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మేము అనుకూలమని ప్రకటించారని గుర్తు చేశారు. ప్రధాని మోదీ అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని కొల్లు రవీంద్ర తెలిపారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ చాలా ఘోరాలు, పాపాలు చేశారని వివరించారు. భూములు ఇచ్చిన రైతులు, మహిళలపై లాఠీఛార్జి చేయించారన్నారు. వారిపై అక్రమంగా కేసులు సైతం పెట్టించి జైలుకు పంపించారని చెప్పారు. చివరకు ఆ ప్రాంతంలో పరదాలు కట్టుకుని జగన్ వెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. న్యాయస్థానం టూ దేవస్థానం అని మహిళలు చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని గుర్తు చేశారు. ఐదేళ్లలో అడుగు పని కూడా చేయకుండా జగన్.. అమరావతిని చంపేందుకు ఎన్నో కుట్రలు చేశారని ఎక్సైజ్ శాఖ మంత్రి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అద్భుతమైన అమరావతి ఆవిష్కృతమవుతుందని మంత్రి కొల్లు రవీంద్ర విశ్వాసం వ్యక్తం చేశారు. ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉండేలా కట్టుదిట్టమైన చట్టం అవుతుందన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి ఇప్పుడు పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని చెప్పారు. వైసీపీ నేతలు చేస్తున్న కుట్రలు, వారు చేసే వ్యాఖ్యలు దుర్మార్గంగా ఉన్నాయని మంత్రి రవీంద్ర తెలిపారు.

# అడుగంటుతున్న జూరాల ప్రాజెక్ట్

- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం
- కర్నాకటతో మాట్లాడనున్న మంత్రి ఉత్తమ్



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది. దీంతో సాగునీటితో పాటు, తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోంది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని , సంబంధిత మంత్రిని కోరారు. మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ఈ సాగునీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో ఫోన్ లో మాట్లాడి, జూరాలకు కనీసం 5 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా, ఈ సమస్య పరిష్కారం కోసం పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు , ఎమ్మెల్యేల బృందం మరో వారం రోజుల్లో బెంగళూరు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నేరుగా కలవాలని నిర్ణయించుకుంది. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటిని విడుదల చేస్తేనే ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోసే అవకాశం ఉంటుంది.

## అమరావతి బిల్లును స్వాగతించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, ఏప్రిల్ 1 :** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభలో ఆమోదం పొందడాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపారు. రాజధాని నిర్మాణం ద్వారా ఎపి పురోగమించాలని ఆకాంక్షించారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.



## భారీగా హైడ్రా కూల్చివేతలు

**రంగారెడ్డి:** తెలంగాణలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. తాజాగా బుధవారం తెల్లవారుజాము నుంచే మైలార్‌దేవుపల్లి సర్కిల్‌లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. సుమారు 30 కోట్ల రూపాయల విలువచేసే స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు తెలుస్తోంది. వివరాల మేరకు.. మైలార్‌దేవుపల్లిలో సర్వే నంబరు 134/20 శాస్త్రిపురానికి చెందిన 6500 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైనట్టు ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలో స్థానికుల ఫిర్యాదుతోరంగంలోకి దిగిన హైడ్రా.. నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్లుగా చేసి అమ్మి సొమ్ముచేసుకున్నట్టు గుర్తించింది. దీంతో, బుధవారం తెల్లవారుజాము నుంచే భారీ బందోబస్తు మధ్య హైడ్రా కూల్చివేతలను చేపట్టింది. పార్క్ స్థలంలో నిర్మాణాలను నేలమట్టం చేసింది. అలాగే, మూడు, నాలుగు అంతస్తులున్న భవనాలను సైతం హైడ్రా సిబ్బంది నేలమట్టం చేసింది. సుమారు 30 కోట్ల రూపాయల విలువ చేసే స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు తెలిసింది. అంతకుముందు మంగళవారం కూడా హైడ్రా ఆక్రమణల కూల్చివేత చేపట్టింది. మంచిరేవుల గ్రామంలోని నాగిరెడ్డికుంటలో 7 ఎకరాల స్థలాన్ని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జాలో ఉంచుకున్నట్లు తేలింది. సర్వే చేయగా.. సదరు సంస్థ కబ్జాచేయగా మిగిలిన భూమిని, స్థానిక నేత విక్రయించినట్లు స్పష్టమైంది. ఆ మేరకు మొత్తం ఆక్రమణలను నేలమట్టం చేశామని హైడ్రా వెల్లడించింది. బహిరంగ మార్కెట్లో వాటి విలువ రూ.934 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అలాగే, బౌరంపేట్‌లోని గండిమైసమ్మ–మియాపూర్ రహదారికి ఇరువైపులా ఎకరా విస్తీర్ణంలో నిర్మించిన రేకుల షెడ్లను హైడ్రా నేలమట్టం చేసింది. ఘట్కేసర్ వద్దనున్న అవుషాపూర్‌లో.. ఇళ్ల స్థలాలుగా మారిన 1,440 గజాల పార్కు భూమికి, జూబ్లిహిల్స్‌లో ఆక్రమణకు గురైన 300గజాల వరద నాలాకు హైడ్రా విముక్తి కల్పించింది.





## సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

### బిల్లు తీసుకురాబోతున్న కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 :** సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్టును షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిటి కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. మైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

## మంగళ్‌హాట్ గోదాముపై పోలీసుల దాడి

### హోటళ్లకు చచ్చిన మేకల మాంసం
### కుళ్లిన పది టన్నుల మాంసం స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 1 :** హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్–ఫాస్ట్, జీహెచ్‌ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వ ఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయట పడింది. ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్మూకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటనలో సదరు గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## వారిద్దరినీ ఓడిస్తేనే కేరళకు మంచి రోజులు

- కేరళ సీఎం విజయన్, ప్రధాని మోదీపై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం
- లెఫ్ట్ ఫ్రంట్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టే..
- కేరళలో రేవంత్ ఎన్నికల ప్రచారం



**హైదరాబాద్:** కేరళలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్)కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టేనని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఢిల్లీ కమ్యూనలిస్టు ప్రధాని నరేంద్ర మోదీ, తివేంద్రం కమ్యూనిస్టు ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఓడగొడితేనే కేరళకు మంచి రోజులు వస్తాయన్నారు. మోదీ––విజయన్‌లవి విభిన్న భావజాలాలైనా, భావాలొక్కటేనని, ఎల్డీఎఫ్–– బీజేపీ మధ్య ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న రేవంత్ రెడ్డి కేరళలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్రివేండ్రం, నేమం, భరతన్నూర్, అలెప్పీ, కాయకుళం నియోజకవర్గాల్లో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ కేరళ సీఎం పినరయి విజయన్‌ను ప్రధాని మోదీతో పోల్చారు. ప్రధాని మోదీకి, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదని, విజయన్ ద్వారా కేరళ భవిష్యత్తును అపహరించాలని మోదీ చూస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను కేరళలోకి రానీయకుండా లక్ష్మణ రేఖ గీసింది యూడీఎఫ్ మాత్రమేనని అన్నా రు. కేరళ ప్రజలు బీజేపీ, ఎల్డీఎఫ్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎవరినైనా బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐతో వేధిస్తుందని, విజయన్‌సర్కారుపై ఈగ కూడా వాలనీయదని ఆరోపించారు. కేరళ సమగ్రాభివృద్ధి యూడీఎఫ్ లక్ష్యమన్నారు.

### పరిస్థితులు పూర్తిగా దిగజారాయి

గత పన్నెండేళ్లుగా ఢిల్లీలో... పదేళ్లుగా కేరళలో పరిస్థితులు పూర్తిగా దిగజారాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో మోదీ, కేరళలో విజయన్ డబుల్ ఫెయిల్యూర్‌గా నిలిచారని ధ్వజమెత్తారు. ఇరువురి సిద్ధాంతాలు వేరైనా వైఫల్యాలు మాత్రం ఒకేలా ఉన్నాయని మండిపడ్డారు. నిరుద్యోగంతో ఇక్కడి యువత ఇబ్బంది పడుతోందని, అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. సోనియా గాంధీ దత్తత తీసుకున్న తెలంగాణ అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని.. కేరళ కూడా అలానే ముందుకు వెళ్లాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. కేరళ అభివృద్ధికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వం వహిస్తారని, వారిద్దరూ కేరళ కుటుంబ సభ్యుల్లా మారారని తెలిపారు. ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్ ఓ సినిమాలో చెప్పిన 'నీ పో మోనే.. దినేశా..' తరహాలో 'నీ పో మోనే విజయన్, యువర్ టైమ్ ఈజ్ ఓవర్' (విజయన్ నీ సమయం అయిపోయింది.. వెళ్లిపో) అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. రేవంత్ మలయాళంలో పలకరించడంతో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. రాత్రికి ఎర్నాకులంలో బస చేసిన రేవంత్ గురువారం కూడా కేరళ ప్రచారంలో పాల్గొననున్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా రేవంత్‌తో కలిసి రోడ్‌షోలకు హాజరయ్యారు.

### కూనంనేని ఆక్షేపణ

కేరళ సీఎం, మార్క్సిస్టు నేత పినరయి విజయన్‌ను ఉద్దేశించి రేవంత్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మిత్రపక్షంగా ఉన్న సీపీఐ తప్పుపట్టింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా విధానాలపై రేవంత్ విమర్శలు చేయొచ్చు కానీ, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరైంది కాదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆక్షేపించారు. మోదీని విమర్శించవచ్చు కానీ, విజయన్‌ను మోదీతో పోల్చడం కూడా సరైంది కాదన్నారు. ఇండియా కూటమిలో వామపక్షాలు కూడా కీలక భాగస్వాములనే విషయాన్ని రేవంత్ గుర్తు పెట్టుకోవాలని కూనంనేని వ్యాఖ్యానించారు.

## అమరావతిపై చర్చలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు

### నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎంపిలు
### తెలంగాణ విభజన హామీలు నెరవేర్చాలన్న ఎంపి వంశీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 :** ఏపీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సందర్భంగా లోక్‌సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమాకారులను కాంగ్రెస్ కాల్చిచంపిందని వ్యాఖ్యానించారు. చివరి దశ ఉద్యమంలో కూడా 1200 మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించుకున్నారన్న కిషన్ రెడ్డి.. సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ కల సాకారమైందన్నారు. అయితే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని ఆరోపించారు. ఏపీలో ఏడు ఎయిర్ పోర్టులు ఉంటే.. తెలంగాణలో ఒక్కటే ఎయిర్ పోర్టు ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహార శైలితోనే తెలంగాణకు ఎయిర్ పోర్టులు రాలేదన్నారు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు కలిసి అభివృద్ధిలో ముందుకెళ్లాలని సూచించారు. అన్నదమ్ముల్లాగా అభివృద్ధిలో ముందుకు సాగాలన్నారు. మోడీ అందిస్తున్న చేయత వల్ల తెలంగాణలో రైలు, రోడ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని అన్నారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతర తెలిపారు. కిషన్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలన్నారు. బీజేపీ ఇచ్చిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు మాట్లాడిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ తెలంగాణకు కేంద్రం బకాయిలు చెల్లించాలనన్నారు. ఏపీ చేపట్టిన బనకచర్లతో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణకు రావాల్సిన 200 టీఎంసీల నీళ్లు ఏపీ డైవర్ట్ చేస్తుందని ఆరోపించారు. బనకచర్లతో వందలాది ఎకరాలు నీట మునుగుతదన్నారు. తెలంగాణ కష్టాల మీద ప్రధాని మోదీ దృష్టిపెట్టాలన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు కోసం రిక్వెస్ట్ చేశామన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అంతర్గాం మండల కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 591 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక అందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణం సాధ్యమవుతుందా అనే విషయమై ప్రీ ఫిజిబులిటీ స్టడీ చేసేందుకు రూ.40.53 లక్షల ఫీజును ఎయిర్? పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్? సెక్రటరీ వికాస్? రాజ్ గతేడాదిలో ఉత్తర్వులు జారీ చేశారు.

## దశాబ్దాలుగా ప్రజలను మోసం చేస్తున్న కూటములు

### రెండు కూటములను సాగనంపండి
### కేరళ ప్రచారంలో రాజ్‌నాథ్ సింగ్ పిలుపు



**తిరువనంతపురం, ఏప్రిల్ 1 :** కేరళంలోని కష్టజీవులు, నిజాయతీపరులైన ప్రజలను దశాబ్దాలుగా లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, యునైటెడ్ డెమోక్రటక్ ఫ్రంట్‌లు వంచిస్తున్నాయని, రెండు కూటమిల్లో ఎవరో ఒకరిని ఎంచుకోవడం కాకుండా రెండింటినీ ఇంటికి సాగనంపాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరవూర్ నియోజకవర్గంలో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ జెండాలు, గుర్తులు వేరైనప్పటికీ వాటి ప్రవర్తన, క్యారెక్టర్ ఒకటేనని చెప్పారు. ఆలోచనా ధోరణి కూడా ఒకటేనన్నారు. సమాజాన్ని విడగొట్టడం, కేరళం ఆర్థిక వ్యవస్థను పతనం చేయడం కోసం పనిచేస్తుంటాయని విమర్శిం చారు. ఎల్డీఎఫ్ అంటే లూటీలు, విభజనలు, వైఫల్యం(లూట్, డివిజన్, ఫెయిల్యూర్) అని రాజ్‌నాథ్ నిర్వచించారు. యూడీఎఫ్‌ను నమ్మదగని, నిజాయతీలేని, మోసపూరితమైనది(అన్‌ట్రస్ట్‌వర్తీ, డిసానెస్టీ, ఫ్రాడ్)గా రాజ్‌నాథ్ అభివర్ణించారు. రెండిట్లోనూ 'ఎఫ్' అనేది కామన్ అనీ, 'ఫ్రంట్' అంటే కరప్షన్ అని ఘాటుగా విమర్శించారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఈ సారి కేరళం ఎన్నికల్లో ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌కు గట్టి సవాల్ విసిరేందుకు ప్రచారం ముమ్మరం చేస్తోంది. సీపీఎం సారథ్యంలోని ఎల్డీఎఫ్ దశాబ్ద కాలంగా అధికారంలో ఉంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ సారథ్యంలో ఎల్డీఎఫ్ కూటమి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు పట్టుదలగా ఉంది. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ పినరయి విజయన్ వైఫల్యాలను ఎండగడుతూ ఈ సారి 100 సీట్లలో తమ గెలుపు ఖాయమంటూ ప్రచారం సాగిస్తోంది. కాగా, బీజేపీ ఓట్ షేర్ కొన్నేళ్లుగా గణనీయంగా పెరిగిందని, ఓటర్లు ఇప్పుడు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని ఎన్డీయే అభ్యర్థి అనూప్ ఆంటోని తెలిపారు. కాగా, కేరళం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఒకే విడతలో ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

### 3వేల మందితో పోలీస్ బందోబస్తు

**హైదరాబాద్, ఏప్రిల్1 :** నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపోతే గురువారం హనుమత్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## చంద్రగిరి వద్ద కారులో మంటలు

### ప్రమాదం నుంచి తప్పించుకున్న ప్రయాణికులు

**తిరుపతి, ఏప్రిల్ 1 :** చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్ రోడ్డులో పలువురు ప్రయాణికులకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. రన్నింగ్ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వారంతా పరుగులు పెట్టారు. డ్రైవర్ అప్రమత్తతో ప్రాణాలు దక్కించుకున్నారు. తిరుపతి నుంచి పీలేరుకు కొంతమంది కారులో ప్రయాణిస్తున్నారు. చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్ రోడ్డు వద్దకు రాగానే కారు ఇంజిన్ నుంచి ఒక్కసారిగా పొగ రావడాన్ని డ్రైవర్ గమనించాడు. ప్రమాదం జరిగే అవకాశం ఉందన్న అనుమానంతో వెంటనే వాహనాన్ని ఆపేశాడు. కారులో ప్రయాణిస్తున్న వారిని అప్రమత్తం చేశాడు. వారంతా కారు నుంచి బయటకు దిగి పరుగులు తీశారు. క్షణాల్లోనే వాహనంలో మంటలు చెలరేగాయి. కారు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. ఇది చూసిన ప్రయాణికులు తృటిలో ప్రాణాలు దక్కించుకున్నామని ఊపిరి తీసుకున్నారు. తోటి వాహనదారుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారు ప్రమాదం గురించి వివరాలను అడిగి తెలుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సంపాదకీయం

# ట్రంప్ చితిమంటల్లో ప్రపంచం విలవిల!



**పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుచిక్కడం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నా అగ్రరాజ్యం అమెరికా పట్టించుకోవడం లేదు. అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పడంతో ఎటు వెళుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఇలాగే ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి.**

అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు ఖర్చు అవుతున్నాయి. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడుసార్లు అక్కడి కార్మికవర్గం ప్రదర్శనలు చేశారు. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారనే అమెరికా అనుసరిస్తున్న విధానం ప్రపంచ దేశాలకు గుదిబండగా మారాయి. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ కూడా రెచ్చిపోవడం దారుణం. ఇదే క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ లక్ష్యానికి గండిపడినట్లే. ఎందుకంటే మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రపంచ దేశాల మీద ఆధారపడి నడుస్తోంది. దీనికితోడు చమరు దిగుమతులపై ప్రభావం కారణంగా దేశంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యింది. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చేనాటికి 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియా లోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే.

పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచించుకుపోయింది. ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి.సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదనగా ఉంది. స్టాక్ మార్కెట్‌కు ఈ యేడాది 'బ్లాక్ ఇయర్'గానే మిగిలిపోయింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది.

విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాథంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా–ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికగా చూడాలి. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ విద్యావం తులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేక పోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం. ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటి విలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగు తుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్తి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండడు.

# మూడు నెలలు నిప్పుల కొలిమి

### ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

### భారత వాతావరణశాఖ హెచ్చరిక



**హైదరాబాద్, ఏప్రిల్ 1 :** రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతోపాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం, పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్‌లో రాష్ట్రంలోని గోదావరి జిల్లాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీమీటర్లకుగాను 33.7 మిల్లీమీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరిదశకు చేరుకుంది. కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్(నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

# ఒంటిమిట్టలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

### శివధనుర్భంగాలంకారంలో శ్రీ కోదండరాముడు



**ఒంటిమిట్ట, ఏప్రిల్ 1 :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం ఉదయం శివధనుర్భంగాలంకారంలో శ్రీ కోదండ రాములవారి రాజసం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.స్వయంవరం సమయంలో శ్రీరాముడు శివుని విల్లును విరిచి సీతమ్మవారిని వివాహమాడే ఘట్టాన్ని గుర్తుచేసేది శివధనుర్భంగాలంకారం. సీతారాముల కల్యాణం రోజున ఉదయం ఈ అలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఇకపోతే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం రాత్రి గరుడ వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 నుండి వాహనసేవ వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారి ని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. గరుత్మంతుడు శ్రీమహావిష్ణువుకు నిత్యవాహనం. దాసుడుగా, సఖుడుగా, విసనకఱ్ఱగా, చాందినిగా, ఆసనంగా, ఆవాసంగా, వాహనంగా ధ్వజంగా అనేక విధాల సేవలందిస్తున్న నిత్యసూరులలో అగ్రగణ్యుడైన వైనతేయుడు కోదండరామస్వామిని వహించి కదిలే తీరు సందర్శనీయమైనది. 108 దివ్య దేశాలలోనూ గరుడసేవ విశిష్టమైనది. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈఓలు ప్రశాంతి, శివప్రసాద్, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ

**ఒంగోలు, ఏప్రిల్ 1 :** ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెంలో మంగళవారం అర్ధరాత్రి రెండు విద్యుత్ ట్రాన్‌ఫార్మర్ల సామాగ్రి చోరీకి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సీహెచ్ మంగమ్మ, షరీఫ్ పొలాలలో వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేశారు. వాటిలో విలువైన రాగి తీగ, ఇంధనం, తదితర సామాగ్రి చోరీ చేసి పరారయ్యారు. ఉదయాన్నే మోటార్లు వేసేందుకు పొలాలకు వెళ్లిన రైతులు చోరీ విషయాన్ని గుర్తించి ఆందోళనకు గురయ్యారు. పోలీసు లకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరకుని పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాగితీగ కోసమే దొంగలు ఈ పనికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


# అదృశ్యమైన మహిళ దారుణ హత్య

### అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**చిత్తూరు, ఏప్రిల్ 1 :** పెద్దపంజాని మండల కేంద్రానికి చెందిన చంద్రమ్మ(35) అనే మహిళ దారుణ హత్యకు గురైంది. చంద్రమ్మ రెండు రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి మహిళ కోసం గాలించగా.. పలమనేరు రూరల్ మండలం జగమర్ల అటవీ ప్రాంతంలో చంద్రమ్మ మృతదేహం లభ్యమైంది. నగదు లావాదేవీలు కారణంగా ఈ హత్య జరిగినట్లు బంధువులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా గత కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది చంద్రమ్మ. పెద్దపంజానిలో టైలరింగ్ పని చేస్తూ చిట్టీల వ్యాపార లావాదేవీలు కొనసాగించేది. చంద్రమ్మ కనబడడం లేదని ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణలో ఆమె హత్య విషయం వెలుగులోకి వచ్చింది. చంద్రమ్మ హత్య స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

# కొత్తగా నమోదు చేసుకున్న రైతులకు ఊరట

### వారికి కూడా రైతు భరోసాకు ప్రభుత్వం సానుకూలం



**హైదరాబాద్, ఏప్రిల్ 1 :** తెలంగాణ రాష్ట్రంలోని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులకు రేవంత్ సర్కార్ భారీ ఊరటనిచ్చింది. ఇప్పటివరకు పాత లబ్దిదారులకే పరిమితమైన రైతు భరోసా పథకాన్ని, కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టా పొందిన రైతులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పట్టా పొందిన సుమారు 85 వేల మంది రైతులు ఉన్నారని అంచనా వేయగా, వారిలో ఇప్పటికే 62 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ ప్రస్తుతం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రైతుల అర్హత, భూమి వివరాలు, పట్టాదారుల నిజానిజాలను నిర్ధారించిన తర్వాత వారం, పది రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. అర్హులుగా తేలిన కొత్త రైతులకు ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీల మధ్య యాసంగి రెండో విడత రైతు భరోసా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సీజన్‌లో సుమారు రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వానాకాలం సీజన్‌లో లబ్ది పొందిన ప్రతి రైతుకు, ఈ యాసంగిలో కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి పెట్టుబడి సాయం అందనుంది. 2025–26 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 69.39 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ. 6,000 చొప్పున మొత్తం రూ. 8,744.13 కోట్లను కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే పంపిణీ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. రైతు భరోసా లబ్దిదారుల సంఖ్యలో నల్లగొండ జిల్లా 5.22 లక్షల మందితో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సంగారెడ్డి (3.53 లక్షలు), ఖమ్మం (3.35 లక్షలు), సిద్ధిపేట (3.18 లక్షలు) జిల్లాలు ఉన్నాయి.

# నేడు వివాహ నిశ్చితార్థం.. అంతలోనే రోడ్డు ప్రమాదం

### ప్రమాదంలో యువకుడు మృతి

**ఖమ్మం, ఏప్రిల్ 1 :** జిల్లాలో విషాదం నెలకొంది. ఎంగేజ్‌మెంట్ చేసుకోవాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణషాపుకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గొడ్డుగొర్ల ప్రసాద్(28) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే అతనికి వివాహం కూడా నిశ్చయమైంది. గురువారం నాడు నిశ్చితార్థం కావాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణ షాపునకు ప్రసాద్ వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేప్పుడు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ప్రసాద్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, రేపు నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు.. ఇలా పాడే ఎక్కడంతో మద్దులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# చేనేతలకు ఉచిత విద్యుత్

- మగ్గాలకు నెలకు 200 యూనిట్లు
- మరమగ్గాలకు నెలకు 500 యూనిట్లు
- ఏటా ప్రభుత్వం 150కోట్ల భారం
- ఏపీ మంత్రి గొట్టిపాటి వెల్లడి



**అమరావతి, ఏప్రిల్ 1 :** ఇచ్చిన హామీ మేరకు చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్అన్నారు. ఈ పథకం ద్వారా ఏటా ప్రభుత్వం రూ.150కోట్లు పైనే భరిస్తోందని మంత్రి వెల్లడించారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ జగన్ నాశనం చేసిన విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో గాడిలో పెడుతున్నారని మంత్రి అన్నారు. 22 నెలలుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ట్రూడౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని చెప్పుకొచ్చారు. యువగళం పాద యాత్రలో చేనేతలకు నారా లోకేశ్ ఇచ్చిన హామీ నేటి నుంచి అమల్లోకి రానుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా చేనేతలు పడుతున్న కష్టాలను చూసిన లోకేశ్ వారికి ఇచ్చిన హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి చేర్చిందని తెలిపారు. జగన్ చేసిన నష్టాలను సరిదిద్దుతూనే రైతులు, చేనేతలు, ఆక్వా, సలూన్‌లకు సబ్సిడీలు ఇస్తున్నామని అన్నారు. వినూత్న ఆలోచనలతో సోలార్, విండ్, పంప్‌డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజెన్ విధానాలతో విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని తగ్గించుకుంటున్నామని తెలిపారు. బయట నుంచి విద్యుత్ కొనుగోళ్లు తగ్గించి.. చరిత్రలో లేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి పెంచామని మంత్రి రవికుమార్ తెలిపారు. ఓల్టేజ్ సమస్యలు పరిష్కరించేందుకు పెద్దఎత్తున సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. చంద్రబాబుకు ఉన్న అపార అనుభవంతో విద్యుత్ సంస్కరణలు ఇంతటితో ఆగేవి కాదని.. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత వెసులుబాటు కల్పించేలా మార్పులు తీసుకొస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.ఇదిలావుంటే పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను సీజన్ ప్రారంభమయ్యే నాటికి మంజూరు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలూ చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లోవోల్టేజీ సమస్యలపై సీపీడీసీఎల్, నెడ్ క్యాప్ అధికారులతో సమీక్షించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొనుగోలు వ్యయం తగ్గించుకోవడానికి పునరుత్పాదక విద్యుత్ వినియోగం పెంచుకోవాలి. నియోజకవర్గానికి ఒక నమూనా సోలార్ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. విద్యుత్ వినియోగదారుల సంతృప్తస్థాయిని 90 శాతానికి పెంచాలని ఆదేశించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని విస్తృతం చేసే దిశగా.. పీఎం సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు చేయాలని రవికుమార్ అన్నారు. 'ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్ కనెక్షన్లతో పాటు వేసవి ముగిసే నాటికి ప్రతి నియోజకవర్గంలో 6 వేల సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలి. ఆర్డీఎస్–ఎస్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి. సీపీడీసీఎల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 11 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణం ఇవ్వాలి. వినియోగదారుల అనుమతితో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

# కొండగట్టు ఆలయంలో అపశృతి

### చలువ పందిళ్లు కూలి 15మందికి గాయాలు

**జగిత్యాల, ఏప్రిల్ 1 :** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

# జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**



**హైదరాబాద్, నేడు ప్రతినిధి:** రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పలు చట్టాలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయకపోవడం బాధాకర మని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టాలు చేయడం, అందులో ముఖ్యంగా తల్లిదండ్రుల రక్షణ, న్యాయవాదుల రక్షణ వంటి చట్టాలు చేయడం అభినందనీయమని, అయితే చాలా కాలంగా తాము అడుగుతున్న జర్నలిస్టుల రక్షణ చట్టం చేయకుండా విస్మరించడం, జర్నలిస్టుల పట్ల తీవ్ర వివక్ష చూపడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో జర్నలిస్టుల రక్షణ చట్టం కోసం తమ అనుబంధ యూనియన్ అయిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) చాలా కాలంగా పోరాడుతుందని, అదే విధంగా రాష్ట్రస్థాయిలో ఈ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశ పెట్టి ఆమోదింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఇప్పటికే చత్తీస్ ఘడ్ లో జర్నలిస్టుల రక్షణకు చట్టం చేశారని, అదేవిధంగా మహారాష్ట్రలో ఇలాంటి చట్టం వచ్చిందని, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశాతో సహా అనేక ఇతర రాష్ట్రాలలో జర్నలిస్టుల రక్షణ కోసం ఇలాంటి చట్టాలు తీసుకురావడాని అధ్యయన కమిటీలు వేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులకు రక్షణ కరువైందని, జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు పెరిగిపోతున్నాయని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాలకంటే ఎక్కువ పోరాడిన జర్నలిస్టులను గత ప్రభుత్వం తీవ్ర వివక్షతో విస్మరించిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం అవలంభించి వైఖరినే అవలంభిస్తున్నదని ఆయన విమర్శించారు. మొన్నటి రాష్ట్ర బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేదని, జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ లో రూపాయి కేటాయింపులు లేవు, ఇండ్ల స్థలాల్లేవు, పెన్షన్ లేదు, పత్రికలకు రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ లేవు, అక్రెడిటేషన్ కార్డులు, ఆరోగ్య కార్డులు లేవని అన్నారు. జర్నలిస్టులను వారి కుటుంబాలను పాలకులు పూర్తిగా విస్మరించడం సరైంది కాదని, ఇది ప్రభుత్వానికే మంచిది కాదని అన్నారు. జర్నలిస్టుల సమస్యలు, ప్రభుత్వ వైఖరి పట్ల ఇతర ప్రధాన జర్నలిస్టు సంఘాలు కిమ్మనకపోవడం విచారకరమని అన్నారు. గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



# పిల్లలకు సంతోషకరమైన బాల్యాన్ని అందించాలి

- బ్రాహ్మణపల్లి సర్పంచ్ ఆలకుంట్ల సుధాకర్
- అంగన్వాడి కేంద్రం-2లో స్వపరిపాలన దినోత్సవం

**గుండాల, నేడు న్యూస్:** పిల్లలకు సంతోషకరమైన బాల్యాన్ని అందించాలని బ్రాహ్మణపల్లి సర్పంచ్ అలకుంట్ల సుధాకర్ అన్నారు. గుండాల మండల పరిధి బ్రాహ్మణపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రం-2లో స్వపరిపాలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళా సంఘ సభ్యులు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ఆలకుంట్ల సుధాకర్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో స్వపరిపాలనకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. గ్రామ ప్రజలు సమిష్టిగా పనిచేస్తే గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు. అనంతరం అంగన్వాడి టీచర్, సిబ్బంది పిల్లలచే పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారుల ఆటా, పాటలు, నృత్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, మహిళా సంఘాలు, గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేసి కార్యక్రమాన్ని ముగించారు. అంగన్వాడి స్వాపరిపాలన దినోత్సవంలో గ్రామ సర్పంచ్ గా దొంతరబోయిన వేదాన్ష్, అంగన్వాడీ టీచర్ గా -బాకీ అన్విత, ఏఎన్ఎం గా- బొర్ర ఆరాధ్య ఆయమ్మ -మేడ అద్విత, ఆశ వర్కర్ -ఆలకుంట్ల నిహారిక లు పాత్రలు పోషించి వారి అభినయంతో విశేషంగా ఆకట్టుకున్నారు.



# మహనీయుల ఆశయాలను కొనసాగించాలి

- ఎంఈఓ బుధారపు శ్రీనివాస్
- టీపీటీఫ్ శాఖ ఆధ్వర్యంలో మహనీయుల స్మృతిలో మార్నింగ్ వాక్

**పెద్దవంగర, నేడు న్యూస్:** ఏప్రిల్ మాసంలో జ్యోతి రావు పూలె, జగజీవన్ రావ్, అంబేద్కర్ జయంతి లు ఉన్న సందర్భంగా ఏప్రిల్ మాసాన్ని మహనీయులు పుట్టిన మాసంగా పరిగనిస్తూ ఆ మహనీయులను స్మరిస్తూ టీపీటీఫ్ పెద్ద వంగర మండల శాఖ అధ్యక్షులు చిక్కాల సతీష్ ఆధ్వర్యంలో మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా మండల విద్యా శాఖా అధికారి బుదారపు శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. గతంలో ఉన్న కుల వివక్షతలను, మూఢ నమ్మకాలను, మహిళల పట్ల వివక్ష తల ను రూపుమాపడానికి, ప్రజలను చైతన్య పరచడికి జ్యోతి రావ్ పూలె పోరాటం చేశారాని అన్నారు. అనంతరం టీపీటీఫ్ నాయకులు సోమరపు ఐలయ్య మాట్లాడుతూ.. దేశం లో కుల, మత, లింగ, ఆర్థిక సమానత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం రావాలంటే చదువే ముఖ్యమని, ఆ చదువుతో సమాజం లో ఉన్న అన్ని సమస్యలకి పరిష్కారం దొరుకుతుందని అంబేత్కార్, జగజీవన్ రావ్ పోరాడారని తెలిపారు. దళిత, బలహీన వర్గాల కొరకు అనేక హక్కులు, సదుపాయలు కల్పించిన మహాన-ుభావులను మనం స్మరించుకోవాలని అన్నారు..వారి ఆశయాల సాధన కోసం అందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డే కొత్తపల్లి హెడ్ మాస్టర్ షెశవల్లి, జిల్లా కార్యదర్శి పెండ్లి రవీందర్ రెడ్డి, మండల కార్యదర్శి వళ్యాల శ్రీనివాస్, దయాకర్, లక్ష్మణ్, మురళి, దేవేందర్, అరుణ, మున్ని, చంద్రశేఖర్, రవి, జాతోత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

- పాత్రికేయులను నిర్లక్ష్యం చేయడం సరికాదు
- సీఎం రేవంత్ రెడ్డికి ఐఎఫ్‌డబ్ల్యూజే లేఖ



**హైదరాబాద్, నేడు ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ ఉపాధ్యక్షుడు (న్యూఢిల్లీ) మోహన్ కుమార్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ పంపారు. ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా సేవలందిస్తున్న పాత్రికేయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయవద్దని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి మెయిల్ ద్వారా పంపిన లేఖ పూర్తి భాగం యథాతథంగా..

ఎ. రేవంత్ రెడ్డి గారికి
ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రభుత్వం.

**విషయం:** తెలంగాణ రాష్ట్రంలో పాత్రికేయుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపు, చిన్న, మధ్యతరహా పత్రికల ప్రకటనల బకాయిల చెల్లింపు, ఎంప్యానెల్‌మెంట్, పింఛను పథకం, అక్రిడిటేషన్ కార్డులు, కేబుల్ ఛానెళ్ల గుర్తింపు, మరియు పాత్రికేయుల రక్షణ చట్టం అమలు.

**అయ్యా,**

తెలంగాణ రాష్ట్రంలో పాత్రికేయ సమాజం, మీడియా వ్యవస్థ పట్ల దీర్ఘకాలంగా కొనసాగుతున్న నిర్లక్ష్యం గురించి, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజేఎఫ్) తరపున, నేను మీకు తీవ్ర ఆందోళన, అత్యవసర పరిస్థితిలో ఈ లేఖ రాస్తున్నాను. నేను ఈ రోజు లేవనెత్తుతున్న విషయాలు కేవలం పరిపాలనాపరమైన ఫిర్యాదులు మాత్రమే కాదు. అవి పత్రికా స్వేచ్ఛ, వందలాది మంది వర్కింగ్ జర్నలిస్టుల జీవనోపాధి, సామాన్య ప్రజల గొంతుకగా నిలిచే చిన్న, మధ్యతరహా పత్రికల మనుగడకు సంబంధించినవి.

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో పాత్రికేయుల సంక్షేమానికి ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. గత రెండేళ్లుగా ప్రభుత్వం పాత్రికేయుల, చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల, పీరియాడికల్స్ సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. ప్రభుత్వ ప్రకటనలు విడుదల చేయకపోవడం, బకాయి ఉన్న ప్రకటనల బిల్లులు చెల్లించకపోవడం వల్ల అనేక మంది ప్రచురణకర్తలు, ఆయా పత్రికల్లో పని చేస్తున్న పాత్రికేయులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయారు. గత కొన్ని నెలలుగా, పీరియాడికల్స్‌కు ప్రభుత్వ ప్రకటనలు పూర్తిగా నిలిపివేశారు. ఒకవైపు సరైన ప్రభుత్వ ప్రకటనలు లేకపోవడం, మరోవైపు బకాయి ఉన్న బిల్లులు చెల్లించకపోవడం వల్ల అనేక చిన్న, మధ్యతరహా వార్తాపత్రికలు, పీరియాడికల్స్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల, ఈ వార్తా పత్రికలనే తమ ఏకైక జీవనాధారంగా చేసుకున్న ఎంతోమంది పాత్రికేయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి కూరుకుపోయారు. దీంతో పాటు, రాష్ట్రంలోని అనేక చిన్న, మధ్యతరహా వార్తా పత్రికలు ఎంప్యానెల్‌మెంట్ కోసం చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. చెల్లుబాటు అయ్యే ఆర్ఎన్ఐ/పిఆర్జిఐ అనుమతులతో నడుస్తున్న వార్తా పత్రికలకు అక్రిడిటేషన్ కార్డుల కనీస గౌరవాన్ని కూడా నిరాకరిస్తున్నారు. అదేవిధంగా, కేబుల్ ఛానెళ్లకు అక్రిడిటేషన్లు జారీ చేయడంపై స్పష్టత లేదు. గతంలో జారీ చేసిన విధంగానే కేబుల్ ఛానెళ్లకు అక్రిడిటేషన్ కార్డులను పునరుద్ధరించేందుకు జీవో 252ను సవరించాలి.

జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కూడా కేటాయించలేదు. సీనియర్ జర్నలిస్టులకు పింఛన్లు అందిస్తున్న అనేక ఇతర రాష్ట్రాల మాదిరిగా కాకుండా, తెలంగాణలో ఒక్క సీనియర్ జర్నలిస్టు కూడా పింఛను పొందడం లేదు. ఈ తీవ్రమైన సమస్యలపై, మా ఐఎఫ్‌డబ్ల్యూజే తెలంగాణ రాష్ట్ర నాయకులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య నేతృత్వంలో భారీ "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ నెల 25వ తేదీన, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాత్రికేయులను ఒకచోట చేర్చి, వారి న్యాయమైన డిమాండ్లను సాధించుకోవడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమం జరిగింది. ఈ పాత్రికేయుల ఆందోళన ఆవేదనలను మీరు తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని మేము అభ్యర్థిస్తున్నాం. అత్యంత జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఒక విషయాన్ని కూడా మేము మీ దృష్టిని తీసుకొస్తున్నాం. దివంగత డాక్టర్ కె. విక్రమ్ రావు – ఒక ప్రఖ్యాత పాత్రికేయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) మాజీ అధ్యక్షుడు. తన విశిష్ట జీవితంలో దశాబ్దాలను పత్రికా స్వేచ్ఛ, పాత్రికేయుల రక్షణ కోసం అంకితం చేశారు. పాత్రికేయులను వారి వృత్తిపరమైన విధులను నిర్వర్తించడం వల్ల ఎదురయ్యే భౌతిక దాడులు, అక్రమ నిర్బంధం, బెదిరింపుల నుండి కాపాడేందుకు ఒక సమగ్ర చట్టమైన పాత్రికేయుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలనేది ఆయన ఆశయం. అత్యంత శాశ్వతమైన, తీవ్రమైన డిమాండ్లలో ఇదొకటి. డాక్టర్ విక్రమ్ రావు యొక్క ఆశయం భారతదేశంలోని అనేక రాష్ట్రాలలో ఇప్పటికే కార్యరూపం దాల్చడం ప్రారంభమైందని మీకు తెలియజేయడానికి మేము సంతోషిస్తున్నాం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, మీడియా నిపుణులపై దాడులు, బెదిరింపుల నుండి వారికి చట్టపరమైన రక్షణ కల్పించేందుకు పాత్రికేయుల రక్షణ చట్టాన్ని రూపొందించింది. అదేవిధంగా మహారాష్ట్ర రాష్ట్రం కూడా అటువంటి చట్టాన్ని రూపొందించి, ప్రత్యేక అమలు యంత్రాంగంతో దానిని అమలులోకి తెచ్చింది. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశాతో సహా అనేక ఇతర రాష్ట్రాలు, పాత్రికేయుల రక్షణ కోసం ఇలాంటి చట్టాలను అధ్యయనం చేయడానికి, అమలు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీలను ఏర్పాటు చేశాయి. ప్రగతిశీల, దూరదృష్టి గల రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్రం కూడా వెనుకబడకుండా, వీలైనంత త్వరగా తెలంగాణ జర్నలిస్టుల కోసం రక్షణ చట్టాన్ని రూపొందించి, మహనీయుడైన డాక్టర్ కె. విక్రమ్ రావు ఆశయాన్ని గౌరవించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. పాత్రికేయుల రాజకీయ అనుబంధాలు, వారి ప్రచురణల పరిమాణం, లేదా వారి పని మాధ్యమంతో సంబంధం లేకుండా, వారి పట్ల ఎలాంటి వివక్ష లేకుండా, ఈ క్రింది అత్యవసర సమస్యలను సానుకూలంగా పరిష్కరించవలసిందిగా మేము మీ గౌరవానికి మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

**వెంటనే పరిష్కరించవలసిన డిమాండ్లు**

- రాష్ట్ర బడ్జెట్‌లో పాత్రికేయుల సంక్షేమం కోసం నిధులు కేటాయించాలి.
- చిన్న,మధ్య తరహా వార్తాపత్రికలు, పీరియాడికల్స్‌కు చెల్లించవలసిన ప్రకటనల బకాయిలను వెంటనే చెల్లించాలి.
- నిరూపితమైన క్రమబద్ధత కలిగిన చిన్న, మధ్య తరహా దినపత్రికలు, పీరియాడికల్స్‌ను మరింత ఆలస్యం చేయకుండా ఎంప్యానెల్ చేయాలి.
- ఎలాంటి వివక్ష లేకుండా, పెద్ద వార్తా పత్రికలతో సమానంగా చిన్న వార్తా పత్రికలకు కూడా ప్రభుత్వ ప్రకటనలు క్రమం తప్పకుండా విడుదల చేయాలి.
- చెల్లుబాటు అయ్యే ఆర్ఎన్ఐ/పీఆర్జీఐ రిజిస్ట్రేషన్‌తో నడుస్తున్న, ఎంప్యానెల్‌లో లేని వార్తా పత్రికలకు తాత్కాలిక చర్యగా అక్రిడిటేషన్ కార్డులు అందించాలి.
- కేబుల్ టీవీ ఛానెళ్లకు పాత పద్ధతిలోనే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి. ఈ సౌకర్యాన్ని పునరుద్ధరించడానికి జీవో 252ను తగిన విధంగా సవరించాలి.
- అర్హులైన పాత్రికేయులందరికీ ప్రాధాన్యతా క్రమంలో అక్రిడిటేషన్ కార్డులు, ఆరోగ్య కార్డులు జారీ చేయాలి.
- ఇళ్లస్థలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, పాత్రికేయులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి.
- అనేక ఇతర రాష్ట్రాలలో అనుసరిస్తున్న పద్ధతికి అనుగుణంగా, పదవీ విరమణ చేసిన సీనియర్ పాత్రికేయులకు నెలవారీ పింఛను ఇవ్వాలి.
- ఐఎఫ్‌డబ్ల్యూజే మాజీ అధ్యక్షులు దివంగత డాక్టర్ కె. విక్రమ్ రావు దార్శనికత స్ఫూర్తితో, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలో ఇప్పటికే అమల్లోకి వచ్చిన చట్టాల తరహాలో తెలంగాణలో పాత్రికేయుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలి.
- చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యలకు మీ గౌరవానికి ప్రాధాన్యతనిచ్చి, తెలంగాణ పాత్రికేయ సమాజం యొక్క సమస్యలను పరిష్కరించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటారని మేము ఆశిస్తున్నాం. విశ్వసిస్తున్నాం ఐఎఫ్‌డబ్ల్యూజే సభ్యులు, తెలంగాణ పాత్రికేయులు మీ నాయకత్వంపై గొప్ప విశ్వాసంతో, అంచనాలతో ఎదురుచూస్తున్నారు.

**అత్యంత గౌరవపూర్వకంగా సోదరభావంతో..**
**మీ విశ్వాసపాత్రుడు,**

– మోహన్ కుమార్
ఉపాధ్యక్షుడు (ఐఎఫ్‌డబ్ల్యూజే) న్యూఢిల్లీ

# గడపగడపకు భారత కమ్యూనిస్టు పార్టీ

- ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ లక్ష్యం
- మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్



**బోడుప్పల్, నేడు న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గడపగడపకు భారత కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాన్ని చేపట్టినట్లుగా మండల సిపిఐ కార్యదర్శి రచ్చ కిషన్ తెలిపారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 11వ డివిజన్ ఇందిరా నగర్ కాలనీలో రచ్చ కిషన్ ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐ పార్టీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడుతూ.. కుల, మత, అవకాశవాద రాజకీయాలను తిప్పికొడదామని పిలుపునిచ్చారు. మనవ హక్కులను, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామన్నారు. దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతుల కష్టాలు, విద్య ఆరోగ్య రంగాలలో సంక్షోభం ఇవన్నీ ప్రజల జీవితాలను కుదిపేస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రజల పక్షాన నిలబడి ఇంటింటికి సిపిఐ ప్రజా సమస్యల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, పోరాటాల ద్వారా పరిష్కారం సాధించడం కోసం కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. పంటలకు సరైన కనీస మద్దతు ధర ఎంఎస్పీ లేకపోవడం ఎరువులు, విత్తనాల ధరలు పెరగడం రుణ భారం వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పంట బీమా సరైన విధంగా అమలు కాకపోవడం, కార్మికుల సమస్యలు కనీస వేతనాలు అమలు కాకపోవడం, కాంట్రాక్ట్ వ్యవస్థ పెరుగుదల కార్మిక హక్కుల ఉల్లంఘన, ఫీజుల భారంతో చదువు భారం అవుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాల నిర్లక్ష్యం, ఉద్యోగ అవకాశాలోపం, ఆరోగ్య సమస్యలు ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాల లేమి, ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ, మందుల ధరల పెరుగుదల, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యవసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గృహ సమస్యలు, ఇల్లు లేని పేదలకు ఇల్లు ఇవ్వడంలో విఫలం, గృహ పథకాలలో అవినీతి, మౌలిక వసతులు, తాగునీటి సమస్య, డ్రైనేజీ, రోడ్ల దారుణ స్థితి, పట్టణ ప్రాంతాలలో అభివృద్ధి లేకపోవడం, ప్రభుత్వం వైఫల్యాలపై ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ పార్టీ సహా కార్యదర్శి సిహెచ్. మాధవి, జి. నాగరాజు, బీసీ సంఘం జిల్లా నాయకురాలు కే. ప్రమీల, మండల కౌన్సిల్ సభ్యులు భూతం ఐలయ్య, నరసమ్మ, సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారీ, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.




# ఇరాన్‌పై యుద్ధం ఆపాలి


- ప్రధాని మోడీ మధ్యవర్తిత్వం ద్వారా యుద్ధాన్ని నిలిపివేయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్, వీరయ్య

**వలిగొండ, నేడు న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు వలిగొండ మండలం నాగారం గ్రామంలోని ఆర్బిఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ క్లాసులకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ.. అమెరికా సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న విధానం వల్ల ప్రపంచ శాంతికి విగాథం కలిగిస్తుందని అమెరికా తన ఆయుధ సంపత్తిని పెంచుకోవడానికి తమ దగ్గర ఉన్న ఆయుధాల నిలువలను అమ్ముకోవడానికి అన్ని దేశాలను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి పెత్తనం చేస్తుందని యుద్ధాలను సృష్టించడం కోసం వెనిజులా,ఇరాన్,క్యూబా తమకు గిట్టని దేశాలపై కవ్వింపు సైనిక చర్యలు చేస్తూ ప్రపంచంలోని అన్నిదేశాల పైనతమ పెత్తనం కొనసాగిస్తూ అంతర్జాతీయ న్యాయ సూత్రాలన్నిటిని ఉల్లంఘించి ఏకధృవ ప్రపంచం సాధించడం కోసం అమెరికా తప్పుడు పద్ధతుల్లో ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తుంది.యుద్ధాలను తన వ్యాపారాన్ని విస్తరింప చేయడానికి ప్రయత్నం చేస్తుంది.ట్రంపు తమ మాట వినని దేశాలపై విచ్చలవిడిగా పన్నుల శాతాన్ని పెంచి వేస్తుంది.దీనివల్ల అన్ని రకాల వస్తువులపై అధిక ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. ఇన్ని రోజులుగా జరుగుతున్న యుద్ధం వల్ల గ్యాస్ ,పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడి భారతదేశ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురి గురవుతున్నారు. అక్కడ ఎక్కడో యుద్ధం జరిగితే మన ఇండ్లలో సరుకుల ధరలు పెరుగుతున్నాయి. భారతదేశంలో ఎగుమతులు దిగుమతుల పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యుద్ధం వల్ల ఎవరికి లాభంలేదు అమెరికా అధ్యక్షుడు ట్రంపు తప్పుడు విధానాల వల్ల మన దేశ సాధారణ ప్రజలు పేద ప్రజల జీవితాలు చితికి పోతున్నాయి.భారతదేశ పాలకులు స్వతంత్ర విధానం తీసుకోవాలి.అమెరికా ట్రంప్ ఒత్తిళ్లకు తలగొద్దు.మన ప్రజలపైభారాలుపడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.ఉపాధి ఉద్యోగాలను కాపాడాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల్ని పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఏప్రిల్ నెల మొత్తం స్థానిక సమస్యల్ని గుర్తించి వాటి పరిష్కారం కోసం దశల వారి పోరాటాలని నిర్వహించి 20 నుండి 30 తేదీ వరకు తహసిల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్లాసులకు కల్లూరు మల్లేశం ప్రిన్సిపల్ గా వ్యవహరించగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దాసరి పాండు, జల్లెల పెంటయ్య, బూరుగు కృష్ణరెడ్డి,శ్రీనివాస చారి, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం,కందడి సత్తిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# భూమి కోల్పోయిన వారికి ఇండ్లు ఇవ్వండి

**చర్లపల్లి బాధితులతో జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**చర్లపల్లి, నేడు న్యూస్:** ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా భూములు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ని కోరారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ్ నగర్ ప్రాంత బాధితులతో కలిసి బుధవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. చర్లపల్లి ఆదర్శ్ నగర్ ప్రాంతంలో భూమి తీసుకొని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామని గతంలో హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు అమలు కాలేదని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలెక్టర్ మనూ చౌదరి ని కోరారు. డబుల్ బెడ్ కోసం భూమి కోల్పోయిన వారికి వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, స్థానిక నాయకులు మత్సగిరి, బాల రాజు, రాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# నేడు లక్ష నాగవల్లి దళార్చన

- ఎన్ఐఎన్ కాలనీ శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు
- శ్రీ హనుమాన్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని నాగవల్లి దళార్చన



**బోడుప్పల్, నేడు న్యూస్:** శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగా ఆలయ అర్చకులు ఆరుట్ల గోపి పంతులు తెలిపారు. శ్రీ హనుమాన్ విజయోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆకు పూజ, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు కొనసాగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా గోపి పంతులు మాట్లాడుతూ.. ఎన్ఐఎన్ కాలనీ శ్రీ శివాంజనేయ దేవాలయంలో శ్రీ ఆంజనేయ స్వామి విజయోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష నాగవల్లి దళార్చన ప్రత్యేక పూజలు జరుగుతాయని వివరించారు. గురువారం ఉదయం 7 గంటలకు మన్యు సూక్త పారాయణం చేత అభిషేకాలు అనంతరం ఎనిమిది గంటలకు నాగవల్లి దళార్చన ప్రత్యేక అభిషేకం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.



# డిటిఎఫ్ పెద్దవంగర మండల నూతన కార్యవర్గం ఎన్నిక

## మండల అధ్యక్షుడిగా జి. దేవదాస్ ఏకగ్రీవ ఎన్నిక

**పెద్దవంగర, నేడు న్యూస్:** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌన్సిల్ నందు ఏకగ్రీవంగా డిటిఎఫ్ నూతన మండల శాఖ ను ఎన్నుకోవటం జరిగింది. డిటిఎఫ్ నూతన అధ్యక్షుడిగా జి. దేవదాస్, ప్రధాన కార్యదర్శి గా జె. కరుణాకర్, ఉపాధ్యక్షులుగా జీ. రమేష్ బాబు, కార్యదర్శులు సిహెచ్. హరికృష్ణ, జి నిఖిల్, జిల్లా కౌన్సిలర్ గా బుదారపు శ్రీనివాస్, ఆడిట్ కమిటీ కన్వీనర్ గా ఎం భాస్కర్, ఎన్నికైయ్యారు. ఎన్నికల అధికారి గా విచ్చేసిన జిల్లా ఉపాధ్యక్షులు పులిపాటి తిరుమలేశ్ మాట్లాడుతూ.. వృత్తి నిబద్ధతతో పాటు సామాజిక బాధ్యత కలిగిన, డిటిఎఫ్ ఎల్లప్పుడూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదం చేస్తుందని, ఉపాధ్యాయుల సమస్యలతో పాటు సామాజిక ప్రయోజనాల కోసం పనిచేస్తుందని తెలిపారు. నూతనంగా ఏర్పడిన డిటిఎఫ్ పెద్ద వంగర మండల శాఖ నూతనోత్సాహంతో పనిచేయాలని కోరారు.



# హృదయ శస్త్రచికిత్స అనంతరం మహాలింగ గురుక్కల్‌ను పరామర్శించిన ఎమ్మెల్యేలు

**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ బంజారాహిల్స్‌లోని స్టార్ హాస్పిటల్స్‌లో పాండిచ్చేరి రాష్ట్రంలోని తిరునల్లార్ శ్రీ దర్బారన్యేశ్వర స్వామి దేవస్థానం పూజారి మహాలింగ గురుక్కల్‌ను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని విచారించారు. గురుక్కల్‌కు హృదయ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడం పట్ల ఎమ్మెల్యేలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురుక్కల్ కుమారుడు దిలీప్ స్వామికి ధైర్యం చెప్పి, గురుక్కల్ ఆశీర్వాదాలు స్వీకరించారు. అదే విధంగా స్టార్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ గుడపాటి రమేష్‌ను మహాలింగ గురుక్కల్ సన్మానించి ఆశీర్వదించారు. గురుక్కల్‌ను కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, ఉప్పలపాటి శ్రీకాంత్, నర్నె శ్రీనివాస్ రావు, సోలిస్ కంటి ఆసుపత్రి చైర్మన్ నందనంపాటి రాము, అరికపూడి ప్రసాద్, మహేష్ గౌడ్, నవీన్ గౌడ్, శంకర్ బాబు, రామకృష్ణ, సుబ్బారావు, లక్ష్మణ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# కోట మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న తహసీల్దార్

**కారేపల్లి, నేడు న్యూస్:** మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కోట మైసమ్మ అమ్మవారిని సింగరేణి మండల తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు బుధవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. కోరిన కోరికలు తీర్చే తల్లిగా పేరుగాంచిన అమ్మవారి ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చ కులు కొత్తలంక కైలాష్ శర్మ, అధికారులు పగడాల మోహన్ కృష్ణ, పర్స సాయి లలిత్ కలిసి శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శివాలయం అర్చకులు భైరవభట్ల సాయిరాం, రెవెన్యూ శాఖ సిబ్బంది బాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలం దరూ సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ పరిసరాల అభివృద్ధిపై కూడా ఆయన వివరాలు తెలుసుకున్నారు.

# చారిత్రక కోనేరును పట్టించుకునే వారెవరు?

- అభిషేకానికి నోచుకోని పవిత్ర జలాలు
- డైమండ్ కటింగ్ మెట్లు.. అపురూప కట్టడం
- పునరుద్ధరించాలని భక్తుల డిమాండ్



**మేడ్చల్, నేడు న్యూస్ :** ఆధ్యాత్మికతకు నిలయమైన మేడ్చల్ రామలింగేశ్వర స్వామి ఆలయ కోనేరు నేడు ఆదరణకు నోచుకోక పిచ్చిమొక్కలు, నాచుతో నిండిపోయి దర్శనమి స్తోంది. ఒకప్పుడు స్వామివారి అభిషేకానికి పవిత్ర జలాలను అందించిన ఈ కోనేరు, ప్రస్తుతం చెత్తాచెదారానికి నిలయంగా మారడంపై భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అభిషేకానికి నోచుకోని పవిత్ర జలాలు :**

స్థల పురాణం ప్రకారం ఈ కోనేరుకు ఎంతో విశిష్టత ఉంది. గతంలో ఆలయ అర్చకులు ఈ కోనేరు నుంచి జలాలను తీసుకువెళ్లి స్వామివారికి అభిషేకం నిర్వహించేవారు. కానీ సరైన నిర్వహణ లేకపోవడంతో నీరు పూర్తిగా కలుషితమైపోయింది. పాచి పేరుకుపోవడంతో నీరు కంటికి కనిపించని స్థితికి చేరుకుంది. కోనేరు మెట్లు సైతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

**డైమండ్ కటింగ్ మెట్లు.. అపురూప కట్టడం :**

చారిత్రక శైలిలో నిర్మించిన ఈ కోనేరు మెట్లు రాతి కట్టడం నాటి ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనం. అయితే, కోనేరు చుట్టూ పిచ్చిమొక్కలు మొలవడం, వ్యర్థాలు పేరుకుపోవడంతో ఈ కట్టడం క్రమంగా తన ఉనికిని కోల్పోతోంది. భక్తులు కోనేరు దరిదాపుల్లోకి వెళ్లడానికే భయపడే పరిస్థితి నెలకొంది.

**పునరుద్ధరించాలని భక్తుల డిమాండ్ :**

రామలింగేశ్వర గుట్ట అభివృద్ధి చెందుతున్నప్పటికీ, దాని అనుబంధంగా ఉన్న ఈ కోనేరును విస్మరించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే కోనేరులోని చెత్తను తొలగించి, నీటిని శుద్ధి చేయాలని మేడ్చల్ పట్టణ ప్రజలు కోరుతున్నారు. శిథిలమవుతున్న మెట్లకు మరమ్మతులు చేపట్టి, భక్తులు దిగడానికి వీలుగా తీర్చిదిద్దాలని కోనేరు చుట్టూ రక్షణ చర్యలు చేపట్టి, పర్యాటక ప్రాంతంగా మార్చాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

# ఎండలు పెరుగుతున్నాయి అప్రమత్తంగా ఉండండి

- వడదెబ్బ తగులకుండా తగిన జాగ్రత్తలు తీసుకోండి
- మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ నేడు బ్యూరో:** రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే సమయాలలో, నేరుగా సూర్య కిరణాలు తాకే స్థలాలలో పని చేసే వారు వడదెబ్బకు గురి కాకుండా నివారణ చర్యలు చేపట్టాలని కూడా కలెక్టర్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. బుధవారం ఆయన ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, వాతావరణ మార్పుల ప్రభావం వల్ల సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతూ, తీవ్రమైన వేడిమితో కూడిన ఎండలు కాస్తున్నందున ప్రజలు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్న సమయంలో వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, ఒకవేళ బయటకు వెళ్లాల్సి వచ్చినా తలకు టోపీ ధరించడం, తువ్వాలు చుట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండ వేడిమి సమయాలలో సాధ్యమైనంత వరకు ప్రయాణాలు పెట్టుకోకూడదని, చల్లదనాన్ని అందించే నీడ ప్రదేశాలలో ఉండాలన్నారు. సాధారణ సమయాలకంటే వేసవిలో ఎక్కువ మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోవాలని, తేలికపాటి కాటన్ వస్త్రాలను ధరించడం వంటివి చేయాలని, త్వరగా వడదెబ్బకు లోనయ్యే స్వభావం కలిగిన వారు విధిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. వృద్ధులు, చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, సముదాయాలలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వేసవి తీవ్రత వల్ల వడదెబ్బకు లోను కాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోరారు. వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు కూడళ్ల దగ్గర, పార్కుల వంటి స్థలాల వద్ద చలి వేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి త్రాగు నీటిని, చలి వేంద్రాలలో ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లను యు.పీ. హెచ్. సీ, పి. హెచ్.సి కేంద్రాలకు ఏ. ఎన్.ఎం, ఆశ వర్కర్లతో పంపిణీ చేయించాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికి శీతల పానీయాలు కాకుండా మంచి నీళ్లు, ఓ.ఆర్. ఎస్ కలిపిన నీళ్లు త్రాగించాలని, నీడ ఉండే ప్రదేశాలలో ఉండేలా చూడాలన్నారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉండే ప్రదేశాలలో నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూగ జీవాలకు, పక్షులకు మంచినీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మను చౌదరి ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

# అప్పాయిగూడెంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించిన సర్పంచ్ దండు ప్రవీణ్



**కారేపల్లి, నేడు న్యూస్:** నూతన ఆర్థిక సంవత్సరం 2026--27కు సంబంధించిన ఉపాధి హామీ పనులను అప్పాయిగూడెం గ్రామంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దండు ప్రవీణ్ కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కూలీలు ఉదయం వేళల్లోనే పనులకు హాజరుకావాలని, ఎండ తీవ్రత పెరగకముందే పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి కూలీ పని ప్రదేశంలో నాలుగు గంటలు పనిచేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు 307 రూపాయల కూలీ పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన టెంట్, తాగునీరు, ప్రథమ చికిత్స పెట్టె వంటి సదుపాయాలను ఏర్పాటు చేస్తామని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు వాంకుడోత్ రమేష్, మేట్ అజ్మీరా సురేష్, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో పనులు ప్రారంభం కావడంతో కూలీలు సంతోషం వ్యక్తం చేశారు.

# న్యూ రాంనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనుల పర్యవేక్షణ

## ఇచ్చిన హామీల అమలులో ముందున్న మాజీ కార్పొరేటర్ బన్నాల గీత



**ఉప్పల్, నేడు న్యూస్:** చిల్కానగర్ డివిజన్ పరిధిలోని న్యూ రాంనగర్ కాలనీలో పీర్లకొట్టం వెనుక భాగంలో రూ.23 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ బన్నాల గీత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నామని తెలిపారు. కాలనీలోని అంతర్గత వీధుల్లో కొత్త సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా ప్రజలకు సౌకర్యాలు మెరుగుపడతాయని చెప్పారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల్లో ఆలస్యం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, జిల్లాల ప్రవీణ్, స్థానికులు శంకరయ్య చారి, కృపాకర్, తిరుపతి, సాయి చరణ్, మంజుల, జ్యోతి, నవనీత, రేణుక పాల్గొన్నారు.



# యాదవ కురుమల ఐక్యతే లక్ష్యం

## మేకల మల్లిబాబు యాదవ్

**కారేపల్లి, నేడు న్యూస్:** ఈనెల 5వ తేదీన ఖమ్మం జిల్లాలో నిర్వహించనున్న యాదవ కురుమల సర్పంచులు, ఉప సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక యాదవ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ప్రచారంలో భాగంగా బుధవారం కారేపల్లి మండలంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ, బీసీలలో అధిక జనాభా కలిగిన యాదవ కురుమలకు జనాభాకు తగిన రాజకీయ ప్రాధాన్యత లభించకపోవడం దురదృష్టకరమని అన్నారు. కులవృత్తిని గౌరవంగా కొనసాగిస్తూ ఉన్నప్పటికీ, విద్యాపరంగా వెనుకబడటం, ఐక్యత లోపించడం వంటి కారణాలతో సామాజికంగా, రాజకీయంగా వెనుకబడుతున్నామని పేర్కొన్నారు. యాదవ కురుమల సంఘటిత శక్తిని పెంపొందించేందుకు ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాబట్టి రాజకీయ, వర్గ, పార్టీ భేదాలు పక్కనపెట్టి యువకులు, మేధావులు, నాయకులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగోడ ఐలయ్య, మారబోయిన రాము, దేగల ఉపేందర్, ఇమ్మడి తిరుపతి రావు, ఉప సర్పంచ్ నన్నే బోయిన ఉపేందర్, బచ్చలకూరి నరేష్, నిజంగా నరేష్, చెవుల లక్ష్మీనారాయణ, ఇమ్మడి సీత, దేగల సైదులు, రాబోతు నరసింహ, గోసి రమేష్, పాలిక వీరస్వామి, ఎనిక రవి, గద్దం వెంకటేశ్వర్లు, బోళ్ల రమేష్, కదారి వెంకట్, మేకల కుమార్, గద్దమీది శ్రీను, తోకల సాయి, మేకల హరీష్, జంగా మధు, ఏర్నాగి సతీష్ తదితరులు పాల్గొన్నారు.




# చర్లపల్లి ఆక్స్ఫర్డ్ గ్రామర్ పాఠశాలలో జాతీయ పతాక ఆవిష్కరణ వేడుకలు

## 3,280 అడుగుల జాతీయ జెండాతో ఆకట్టుకున్న వేడుకలు

**ఉప్పల్/ చర్లపల్లి, నేడు న్యూస్:** కాప్రా పరిధిలోని చర్లపల్లి ఆక్స్ఫర్డ్ గ్రామర్ పాఠశాలలో జాతీయ పతాక ఆవిష్కరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 3,280 అడుగుల పొడవైన భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భారీ జెండా అందరినీ ఆకట్టుకుని ప్రాంతమంతా దేశభక్తి వాతావరణాన్ని సృష్టించింది. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాకం చేతబట్టి జై హింద్, వందే మాతరం నినాదాలతో వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. చుట్టుపక్కల ప్రాంతమంతా దేశభక్తి నినాదాలతో మార్మోగింది. పాఠశాల యాజమాన్యం చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించడం ముఖ్యమని పేర్కొంది. దేశాభివృద్ధికి యువత ముందుండాలని పిలుపునిచ్చింది. ఉపాధ్యాయులు దేశభక్తి గీతాలు, ప్రసంగాలతో విద్యార్థులను ప్రేరేపించారు. కొందరు విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గద్దం యాదగిరి, చర్లపల్లి సీఐ సుధాకర్, ఎస్ఐ శేఖర్, ఈసీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సీతారాం రెడ్డి, కేవీ ఎల్ఎన్ రావు, కాంగ్రెస్ నాయకులు నరేందర్, వెంకటేష్, మనోహర్, ప్రేమ్, ఆనంద్ రాజ్ గౌడ్, రామచంద్ర గౌడ్, రెడ్డి నాయక్ పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# వైభవంగా ఆంజనేయస్వామిలుదీక్ష విరమణ

## ప్రత్యేక హోమ పూజలు భారీగా తరలివచ్చిన భక్తులు

**కారేపల్లి, నేడు న్యూస్:** భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని సామ్య తండాలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయ స్వామి దీక్ష విరమణ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించబడింది. దీక్షలో పాల్గొన్న భక్తులు నియమ నిష్ఠలతో దీక్షను పూర్తి చేసి, సంప్రదాయబద్ధంగా ఇరుముడి కట్టుకుని స్వామివారిని దర్శించుకున్నారు. దీక్ష విరమణ అనంతరం ఇరుముడి ధరించిన స్వాములు ఆలయంలో ప్రత్యేక హోమ పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి కోసం సామూహికంగా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తి వాతావరణంతో నిండిపోయి ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమానికి పోలంపల్లి దిశా కమిటీ సభ్యురాలు, గ్రామపంచాయతీ సర్పంచ్ హేమలత బాలాజీ, ఉప సర్పంచ్ గుగులోత్ సర్వన్, పాత్రికేయుడు వాంకుడోత్ బన్సీలాల్, అక్షరం ఆయుధం బృంద సభ్యులు భూక్యా రవీందర్, బోడా రవి, హట్కర్ రాంబాబు, అంగోత్ రాములు, వాంకుడోత్ రవికుమార్, క్రాంతి రిపోర్టర్ కళ్యాణ్, గుగులోత్ నవీన్ నాయక్ తదితరులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ గ్రామ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం గ్రామంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు భక్తి భావాన్ని మరింత బలపరిచింది.

# నేడు గ్రామాలు, వార్డుల వారిగా సభలు

**వివిధ పథకాలు, అంశాలు, సమస్యలపై చర్చించి, పరిష్కారానికి నిర్ణయం తీసుకోనున్నారు**



**మేడ్చల్, నేడు బ్యూరో:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం – 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, ఏప్రిల్ 2 న మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో వార్డుల వారిగా సభలు, సమావేశాలు ( గ్రామ సభలు ) నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈ సభల్లో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.

### 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక:

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పాలనా పగ్గాలు చేపట్టి రెండేళ్లు ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నుంచి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను చేపట్టాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ప్రతి నెల 6 నుంచి 15 వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ, పారిశుద్ధి కార్యక్రమాలను నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి ముందే షెడ్యూల్ ను కూడా విడుదల చేసింది. దాని కొనసాగింపులో భాగంగానే ఏప్రిల్ 2న గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో సభలు, సమావేశాలు నిర్వహించి వివిధ అంశాలను చర్చించనున్నారు. అందులో భాగంగా మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీల లో మొత్తం 68 వార్డులు, కౌన్సిలర్లు న్నారు. ఈ వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారు. వీటిలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, వాటి అమలుపై చర్చించనున్నారు.

### గ్రామ సభల లక్ష్యం :

- ఈ గ్రామ సభల ప్రధాన లక్ష్యం పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలా ఉంది.
- అలాగే, ప్రభుత్వ పథకాలపై చర్చించడం,
- లబ్ధిదారుల అభిప్రాయాలు స్వీకరించడం.
- మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను, ప్రాధాన్యతలను గుర్తించడం.
- వాటి పరిష్కారంపై చర్చించనున్నారు.

### సభల్లో పాల్గొనే వారు

జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, ప్రజా ప్రతినిధులు మున్సిపాలిటీల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, వార్డ్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్వయం సహాయక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు. పాల్గొననున్నారు.

### కార్యక్రమాల వివరాలు :

- ఈ సభల్లో మొదలు రాష్ట్ర గీతం అలాపన ఉంటుంది. అనంతరం
- మున్సిపల్ ఛైర్మన్, మునిసిపల్ కమిషనర్ స్వాగతోపన్యాసం ఉంటుంది. ఆ తర్వాత సీ.ఎం సందేశాన్ని చదివి వినిపిస్తారు. సమావేశంలో
- వివిధ పథకాలు సాధించిన ప్రగతిని, ప్రభుత్వ పథకాలు పొందిన వారి జాబితాను వెల్లడిస్తారు.
- అలాగే, లబ్ధిదారుల అభిప్రాయాలు ,అనుభవాలను స్వీకరిస్తారు.
- ప్రజా ప్రతినిధుల సందేశాలు ఉంటాయి.

8. గ్రామ సమస్యలపై చర్చ, పరిష్కారం పై నిర్ణయం, తీర్మానాలు చేస్తారు. వాటిని ప్రభుత్వానికి నివేదిస్తారు.

## ప్రజాపాలన సభలు ప్రజలకు న్యాయం చేసే వేదికలుగా మారాలి

**కొండబోయిన నాగేశ్వరరావు**



**కారేపల్లి, నేడు న్యూస్:** ఏప్రిల్ 2న నిర్వహించనున్న ప్రజాపాలన గ్రామ సభలు ప్రజల సమస్యలకు న్యాయం చేసే వేదికలుగా మారాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు ఆకాంక్షించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, గతంలో ప్రజాపాలన కార్యక్రమాల సందర్భంగా ప్రభుత్వం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అనేక సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ, వాటి అమలులో లోపాలు ఉన్నాయని తెలిపారు. ఈసారి మాత్రం ప్రజల ఆశలను నెరవేర్చే విధంగా కార్యక్రమాలు సాగాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.2500 ఆర్థిక సాయం, భూమిలేని పేదలకు సంవత్సరానికి రూ.12,000, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతులకు రైతు భరోసా, పంటలకు బోనస్, మద్దతు ధర కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి హామీలు సమర్థవంతంగా అమలు కావాలని కోరారు. అలాగే వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ల పెంపు, కొత్త పెన్షన్ల మంజూరు, కల్యాణ లక్ష్మి, షాది ముబారక్, తులం బంగారం, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల సాయం, ఉద్యమకారులు మరియు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఉపాధి హామీ కూలీలకు 150 రోజుల పని, రోజుకు రూ.400 కూలి వంటి హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ అభివృద్ధికి పంచాయతీ పాలన కీలకమని, అవసరమైన నిధుల కేటాయింపు, గ్రామ సమస్యల పరిష్కారం, పెండింగ్ హామీల అమలుపై ఈ గ్రామ సభల్లో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన సభల్లో ఇప్పటివరకు చేసిన పనులను ప్రజలకు వెల్లడిస్తూ, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామసభ తీర్మానాలు తీసుకోవడం ద్వారా ప్రజల్లో నమ్మకం పెంచాలని కొండబోయిన నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు.



## కోఆపరేటివ్ సంస్థలపై వ్యాపారుల ఆందోళన

**ధర్నాలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి**

**ఉప్పల్, నేడు న్యూస్:** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. కోఆపరేటివ్ సంస్థలు రిటైల్ చికెన్ దుకాణాలకు సరైన లాభం ఇవ్వకపోవడం వల్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో తక్కువ లాభంతో వ్యాపారం కొనసాగించడం కష్టంగా మారిందన్నారు. రిటైల్ వ్యాపారులు నష్టాల్లో కొనసాగుతున్న పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. ప్రభుత్వం, సంబంధిత సంస్థలు వెంటనే స్పందించి న్యాయమైన లాభం కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యాపారుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునివ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. రిటైల్ వ్యాపారులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## చెక్కుతో పాటు తులం బంగారం ఇవ్వాలి

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ**

**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఉప్పల్ మండలానికి చెందిన 172 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కుల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరగాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించిన విధంగా లక్ష నూట పదహారు రూపాయలతో పాటు తులం బంగారం కూడా అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా.. ఖతార్, కువైట్‌పై డ్రోన్ దాడి

**యూకే :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రంగా మారుతున్నాయి. తాజాగా ఖతార్‌లోని దోహాకు సమీపంలో ఓ ట్యాంకర్‌పై గుర్తుతెలియని క్షిపణి దాడి చేసింది. ఈ మేరకు యూకే సముద్ర వ్యవహారాల అథారిటీ వివరాలు వెల్లడించింది. పోర్టు పక్కన నిలిచిఉన్న ఇంధన ట్యాంకర్‌పై జరిగిన దాడి కారణంగా నౌక ఎడమవైపు భాగం దెబ్బతింది. అయితే, దీనివల్ల చమురు లీకేజీకి, పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగలేదని అథారిటీ పేర్కొంది. యుద్ధం మొదలైన నాటినుంచి అరేబియా గల్ఫ్, హర్మూజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్‌తో పాటు వాటి పరిసర ప్రాంతాల్లోని నౌకలే లక్ష్యంగా దాదాపు 26 దాడులు జరిగినట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ వెల్లడించింది.

**కువైట్‌లోనూ..** మరోవైపు, కువైట్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులోని ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ మేరకు దేశ పౌర విమానయాన శాఖ వెల్లడించింది. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదు. కానీ ఇంధన ట్యాంకర్లకు గణనీయమైన నష్టం వాటిల్లినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## కుప్పకూలిన రష్యా సైనిక విమానం

**29 మంది మృతి**



**మాస్కో:** క్రిమియా ద్వీపకల్పం మీదుగా వెళ్తున్న సమయంలో రష్యాకు చెందిన ఆంటోనోవ్ ఏఎన్–26 సైనిక విమానం కుప్పకూలిపోయింది. దీంతో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాలను టాస్ వార్తా సంస్థ బుధవారం పచురించింది. "మార్చి 31న సాయంత్రం 6 గంటలకు ఏఎన్–26 సైనిక రవాణా విమానంతో కమ్యూనికేషన్ కోల్పోయాం" అని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. రెస్క్యూ టీమ్ ఏఎన్–26 విమానం కూలిన ప్రదేశాన్ని గుర్తించింది. సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రాథమికంగా తెలిపింది. ఆ విమానం ఓ కొండ అంచును ఢీకొని కూలిపోయిందని పలు రిపోర్టుల ద్వారా తెలుస్తోంది. సైనిక విమానం కుప్పకూలడం వెనుక ఉన్న కారణాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. మీడియా అడిగిన ఇతర వివరాలపై రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతిస్పందించలేదు. ఏఎన్–26 విమానం 1960 దశకం చివర నుంచే సర్వీసులో ఉంది. ఈ మోడల్‌ను సరుకు రవాణా కోసం ఎయిర్‌లైన్స్ కూడా ఉపయోగించాయి. గత దశాబ్దంలో ఈ మోడల్‌కు విమానాలు పలు ప్రమాదాలకు గురయ్యాయి. 2022లో ఘుక్రెయిన్ దక్షిణ–తూర్పు జపోరిజ్జియా ప్రాంతంలో విమాన ప్రయాణం సమయంలో ఉక్రెయిన్‌కు చెందిన ఏఎన్–26 కూలి ఒకరు మరణించారు. 2020లో ఉక్రెయిన్ ఉత్తర–తూర్పు ప్రాంతంలో శిక్షణ విమాన ప్రయాణం సమయంలో అది కూలి 26 మంది మృతి చెందారు.

## యుద్ధం ముగింపునకు సిద్ధమే

**షరతులు వర్తిస్తాయన్న ఇరాన్**

**టెహ్రాన్, ఏప్రిల్ 1 :** అమెరికా– ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు. అప్పుడు ఈ యుద్ధం ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సంభాషణ తర్వాత ఆంటోనియో కోస్టా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను తగ్గించుకోవాలని కోరారు. దౌత్య మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి ప్రస్తావించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నుంచి తనకు నేరుగా సందేశాలు అందుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. అయితే, ఆ దేశంతో చర్చలు జరుపుతున్నామనేది దాని ఉద్దేశం కాదన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని సందేశాలు మధ్యవర్తుల ద్వారా కూడా వచ్చాయన్నారు. యూఎస్‌తో తాము ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని.. ఆ దేశం చేసిన ప్రతిపాదనలపై తాము ఇంకా స్పందించలేదని వెల్లడించారు. కాల్పుల విరమణకు తాము అంగీకరించమని.. యుద్ధం ముగింపును మాత్రమే తాము కోరుకుంటున్నామని అరాగ్చీ స్పష్టం చేశారు.

## 2019 తర్వాత.. తొలిసారి భారత్‌కు ఇరాన్ ముడిచమురు



**న్యూఢిల్లీ :** యుద్ధం కారణంగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ఇటీవల అమెరికా పేర్కొన్న విషయం తెలిసిందే. దీంతో ఇరాన్ చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఇరాన్ నుంచి ఓ ఆయిల్ ట్యాంకర్ భారత్ వైపు బయల్దేరింది. మార్చి 4వ తేదీన ఖర్గ్ ద్వీపం వద్ద ట్యాంక్‌లోకి చమురు లోడింగ్ చేశారని.. ఏప్రిల్ 4న గుజరాత్ వాడినార్ పోర్టుకు ఇది చేరుకోనుందని డేటా ఇంటెలిజెన్స్ సంస్థ క్లెప్లర్ వెల్లడించింది. 2019 తర్వాత ఇరాన్ చమురు భారత్‌కు రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇందులో దాదాపు 6,00,000 బ్యారెళ్ల చమురు ఉండొచ్చని అంచనా. ఇరాన్ నుంచి వస్తున్న ఈ చమురును ఏ భారతీయ రిఫైనరీ ఉపయోగించనుందనే విషయంపై ఎటువంటి సమాచారం లేదు. గతంలో భారత్.. ఇరాన్ చమురుకు ప్రధాన కొనుగోలుదారుగా ఉండేది. ఒకానొక సమయంలో..మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా సుమారు 11.5 శాతంగా ఉండేది. 2018లో భారత్ రోజుకు సుమారు 5,18,000 బ్యారెళ్ల ఇరాన్ చమురును దిగుమతి చేసుకోగా.. మే 2019 నాటికి అది రోజుకు 2,68,000 బ్యారెళ్లకు తగ్గింది. ఆ తర్వాత, ఇరాన్‌పై అమెరికా ఆంక్షల కారణంగా ఆ దేశం నుంచి చమురు దిగుమతులు పూర్తిగా తగ్గిపోయాయి.



## ఉత్తర కొరియా హ్యాకర్ల పంజా

**వేలాది అమెరికా కంపెనీలు ఎఫెక్ట్**

**వాషింగ్టన్ :** ఉత్తర కొరియాకు చెందిన సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. వేలాది అమెరికా కంపెనీలు ఉపయోగించే సాఫ్ట్‌వేర్ ప్యాకేజీని అక్రమంగా యాక్సెస్ చేశారు. ఈ సైబర్ దాడి నుంచి అమెరికా కంపెనీలు కోలుకోవడానికి కొన్ని నెలల సమయం పట్టనుందని సెక్యూరిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థకు సంబంధించిన ప్రతి రంగంలోని కంపెనీలు ఉపయోగించే యాక్సియోస్ అనే ఓపెన్ సోర్సు సాఫ్ట్‌వేర్‌ను నిర్వహించే ఓ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఖాతాను హ్యాకర్లు యాక్సెస్ చేశారు. దాంతో ఆ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన తప్పుడు అప్‌డేట్లను కంపెనీలకు పంపించారు. హ్యాకింగ్‌ను గుర్తించిన సాఫ్ట్‌వేర్ డెవలపర్ తన అకౌంట్‌ను తిరిగి తన నియంత్రణలోకి తెచ్చుకొనేవరకు ఈ దాడి జరిగినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. ఈ ప్రభావాన్ని అంచనా వేసి, దానినుంచి కోలుకునేందుకు ఆయా కంపెనీలకు కొన్ని నెలల సమయం పట్టొచ్చని తెలుస్తోంది. ఇది ఉత్తరకొరియా హ్యాకర్ల పనేనని సైబర్ ఇంటెలిజెన్స్ సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఉత్తర కొరియాకు చెందిన హ్యాకర్లు ఇలాంటి దాడులకు పాల్పడటం ఇదేం కొత్తకాదు. గతంలో పలు బ్యాంకులు, క్రిప్టో కరెన్సీ సంస్థలపై సైబర్ దాడికి పాల్పడి బిలియన్ల డాలర్లు దొంగిలించారని వార్తలు వచ్చాయి. ఆ సొమ్మును కిమ్ యంత్రాంగం తమ క్షిపణుల అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు సమాచారం.



## 4000 టార్గెట్‌లు.. 16 వేల బాంబులు

**ఇరాన్‌పై ఇజ్రాయెల్ పిడుగులు**

**ఇజ్రాయెల్ :** దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్‌పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. "ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం" అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.



## ఇరాన్ దిశగా అమెరికా మూడో విమాన వాహక నౌక

**వాషింగ్టన్ :** రాబోయే రోజుల్లో ఇరాన్‌పై దాడులు మరింత భీకరంగా ఉంటాయని అమెరికా హెచ్చరించిన వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అగ్ర రాజ్యానికి చెందిన మరో విమాన వాహక నౌక పశ్చిమాసియాలో మోహరించనుంది. యూఎస్ఎస్ హెచ్‌డబ్ల్యూ బుష్ నౌక పశ్చిమాసియా దిశగా బయల్దేరిందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. వర్జీనియాలోని నార్‌ఫోల్క్ నుంచి ఈ విమాన వాహక నౌక బయల్దేరింది. ఇప్పటికే పశ్చిమాసియాలో యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్, యూఎస్ఎస్ అబ్రహం లింకన్ అనే రెండు విమాన వాహక నౌకలు మోహరించిన సంగతి తెలిసిందే. వాటికి అదనంగా యూఎస్ఎస్ హెచ్‌డబ్ల్యూ బుష్ రంగంలోకి దిగనుంది. యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌లో సమస్యలు ఎదురైనట్లు ఇటీవల వార్తలు వచ్చినవేళ.. ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇరాన్‌లో దాదాపు నెల రోజులకు పైగా సాగుతోన్న యుద్ధంలో అత్యంత కీలకమైన రోజులు త్వరలో ప్రారంభం కానున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల హెచ్చరించారు. ఈనేపథ్యంలో వేలాది మంది అమెరికా సైనికులు పశ్చిమాసియా వైపు వెళ్తున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు రాసుకొచ్చాయి. ఇరాన్‌లో భూతల దాడుల కోసమే వీరిని పంపుతున్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి.

# భారీ లాభాల్లో స్టాక్‌మార్కెట్లు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1187 పాయింట్లు లాభపడి 73,134కు చేరుకుంది. నిఫ్టీ 348 పాయింట్లు లాభపడి 22,679 వద్ద ట్రేడయింది. విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు తగ్గడం, ఇరాన్‌లో తమ సైనిక చర్యను అతి త్వరలోనే మ-ంగిస్తామని ట్రంప్ నుంచి సానుకూల ప్రకటన వంటివి సూచీలకు కలిసొచ్చాయి. నేటి ట్రేడింగ్ సెషన్‌లో ఉదయం సెన్సెక్స్ 1800కిపైగా పాయింట్ల లాభపడగా.. నిఫ్టీ 550కిపైగా పాయింట్లకు పైగా లాభాల్లో ట్రేడైంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, ఇండిగో, అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎస్‌బీఐ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. ఎన్టీపీసీ, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్లు ఉండగా.. బంగారం ఔన్సు 4736 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.







## ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదపు

- 30వేల మంది టెక్కీల తొలగింపు
- అందులో 12వేల మంది భారతీయులు

**న్యూయార్క్, ఏప్రిల్ 1 :** అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ మంగళవారం ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 1.62 లక్షల మంది సిబ్బందిలో 18 శాతం, అంటే దాదాపు 30,000 మందిని తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12,000 మంది భారతదేశానికి చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాది మంది ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతో పాటు, కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని ఐటీ ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాలు గత ఏడాదితో పోలిస్తే 95శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, కంపెనీ ఇప్పుడు ఎఐ డేటా సెంటర్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టుతోంది. సుమారు 156 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్ చేపట్టగా, అందులో భాగంగా ఇప్పటికే 50 బిలియన్ డాలర్లు అప్పు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగాల కోతలు విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్యల ద్వారా కంపెనీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా అవుతుందని అంచనా. ఇక తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొన్ని పరిహారాలు ప్రకటించింది. అదనంగా మూడు నెలల జీతం,కంపెనీలో పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం,కార్మిక చట్టాల ప్రకారం గ్రాట్యుటీ.అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ నిర్దేశించిన గడువులోపు రాజీనామా చేసిన వారికే వర్తిస్తాయని పేర్కొన్నారు.





# మెరిసిన రిజ్వీ.. మురిసిన ఢిల్లీ

**లఖ్‌నవూ:** ఐపీఎల్ 2026 లో దిల్లీ క్యాపిటల్స్ బోణీ కొట్టింది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ 18.4 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని దిల్లీ 17.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సమీర్ రిజ్వి (70; 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ట్రిస్టన్ స్టబ్స్ (39; 32 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. లక్ష్యఛేదనలో దిల్లీకి ఆరంభంలోనే వరుస షాక్‌లు తగిలాయి. కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్ డకౌట్ కాగా.. పాథుమ్ నిశాంక (1) నిరాశపర్చాడు. నితీశ్ రాణా (15) కూడా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరాడు. దీంతో దిల్లీ 26 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సమీర్ రిజ్వీ.. స్టబ్స్‌తో కలిసి దిల్లీని విజయం దిశగా నడిపించాడు. ఈ జోడీ అభేద్యమైన ఐదో వికెట్‌కు 76 బంతుల్లో 119 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. లఖ్‌నవూ బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 2, మహ్మద్ షమి, మోసిన్ ఖాన్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్‌లో మిచెల్ మార్ష్ (35; 28 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (36; 25 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్స్) రాణించారు. ఐదెన్ మార్‌క్రమ్ (11), నికోలస్ పూరన్ (8), రిషభ్ పంత్ (7), ఆయుష్ బదోని (0) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. దిల్లీ బౌలర్లలో నటరాజన్, లుంగి ఎంగిడి చెరో 3 వికెట్లు, కుల్‌దీప్ యాదవ్ 2, అక్షర్ పటేల్ ఒక వికెట్ తీశారు.




## మార్చిలో 2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు

**న్యూఢిల్లీ :** దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదయ్యాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధితో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈస్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షలుగా నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లు రూ.22.27 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

## గ్లెన్ మ్యాక్స్‌వెల్ సెంట్రల్ కాంట్రాక్ట్ పోయింది




ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్‌ను ప్రకటించింది. 2026-27 సీజన్‌కు గాను 21 మందికి అవకాశం కల్పించింది. అయితే, వెటరన్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్‌కు అవకాశం రాలేదు. అతడికి ఎటువంటి కేటగిరీలోనూ చోటు కల్పించలేదు. మ్యాక్స్‌వెల్ 2017లో చివరిసారిగా టెస్టు మ్యాచ్ ఆడాడు. దీంతో రాబోయే సీజన్‌లో ఎక్కువ టెస్టులు ఆడే వారికే సెంట్రల్ కాంట్రాక్ట్ ఇవ్వడం గమనార్హం. భారత్, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్‌తో ఆసీస్ టెస్టు సిరీస్‌లను ఆడనుంది.

### కేవలం టీ20ల్లోనే ఉన్నప్పటికీ..

టెస్టు జట్టులో స్థానం లేని మ్యాక్సీ గతేడాది వన్డేలకు వీడ్కోలు పలికాడు. ఈ 37 ఏళ్ల ఆటగాడు కేవలం అంతర్జాతీయ టీ20ల్లోనే కొనసాగుతున్నాడు. అయితే, గత టీ20 ప్రపంచకప్‌లోనూ పెద్దగా ప్రభావం చూపించలేదు. మళ్లీ రెండేళ్ల తర్వాత పొట్టి కప్ రానుంది. దానికోసం క్రికెట్ ఆస్ట్రేలియా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులోభాగంగా గ్లెన్ మ్యాక్స్‌వెల్‌కు చోటు కల్పించడం దాదాపు కష్టమే. దీంతో గ్లెన్ మ్యాక్స్‌వెల్ అంతర్జాతీయ కెరీర్ దాదాపు ముగిసినట్లేనని క్రికెట్ వర్గాల అంచనా.

### టెస్టులే ప్రామాణికంగా..

ఆస్ట్రేలియా సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్ట్‌ను చూస్తే టెస్టు ఫార్మాట్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లైంది. మెరుగ్గా రాణించేవారికే క్రికెట్ బోర్డు చోటు కల్పించింది. ఇటీవల టెస్టులకు రిటైర్‌మెంట్ ప్రకటించిన ఉస్మాన్ ఖవాజాకు అవకాశం దక్కలేదు. భారత్‌తో బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ 2024లో అదరగొట్టిన ఓపెనర్ కొన్‌స్టాస్ ఇటీవల తేలిపోయాడు. దీంతో అతడినీ పక్కన పెట్టేసింది.

## ఏం ఫర్వాలేదు.. అంతా బాగుంది

### గాయంపై శ్రేయస్ అయ్యర్




గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ చేతికి గాయమైంది. ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో రషీద్ ఖాన్ వేసిన బంతిని స్ట్రైకర్‌లోని కూపర్ కనోలీ కొట్టాడు. అది నేరుగా వెళ్లి నాన్‌స్ట్రైకర్ శ్రేయస్ అయ్యర్ చేతికి బలంగా తాకింది. దీంతో స్టేడియంలోని పంజాబ్ అభిమానులు కలవరానికి గురయ్యారు. బాధతో విలవిలాడిన శ్రేయస్ ప్రాథమిక చికిత్స చేయించుకున్నాడు. అయినా సరే, బాధతో ఇబ్బందిపడుతూనే బ్యాటింగ్ కొనసాగించేందుకు ప్రయత్నించాడు. అయితే, 18 పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. కనోలీ కీలక ఇన్నింగ్స్‌తో పంజాబ్ తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం తన గాయంపై శ్రేయస్ స్పందించాడు. "తొలి మ్యాచ్‌లోనే విజయం సాధించడం బాగుంది. బంతి బలంగా తాకడంతో బాగా నొప్పి వచ్చింది. అయితే, ఇప్పుడు అంతా బాగానే ఉంది. గెలిచిన ఉత్సాహంలో ఉన్నప్పుడు అపశకునం మాటలు మాట్లాడకూడదు. నేనెప్పుడూ పాజిటివ్ దృక్పథంతోనే ఉంటా. ప్రతీది మన మంచికేనని ఆశిస్తా. కనోలీ ఆటను ఎదురుగా ఉండి చూడటం బాగుంది. నాణ్యమైన షాట్లు కొట్టాడు. స్వల్ప వ్యవధిలో వికెట్లు పడినా కనోలీ మాత్రం చివరివరకూ క్రీజ్‌లో ఉండి జట్టును గెలిపించడం అభినందనీయం. త్వరగా వికెట్లు కోల్పోవడం మమ్మల్ని కాస్త టెన్షన్‌కు గురిచేసింది. నేను పెవిలియన్‌కు చేరిన తర్వాత నా చేతి గురించి ఆలోచిస్తూ ఉండిపోయా. దానికి ఐస్ పెడుతూ కాస్త సపర్యలు చేశా. ఈలోగా రెండు వికెట్లు టపటపా పడ్డాయి. ఐపీఎల్‌లో ఇలాంటి పరిస్థితులు కొత్తేం కాదు. వాటిని అధిగమించి కూపర్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు" అని అయ్యర్ తెలిపాడు.

### వైశాఖ్ సూపర్..

"తొలుత బౌలింగ్‌లో మూడో ఓవర్ తర్వాత పిచ్ కాస్త మందకొడిగా అనిపించింది. వెంటనే ప్లాన్‌లో మార్పులు చేసుకున్నాం. వైశాఖ్ చక్కని లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులేశాడు. ప్రత్యర్థిని కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. మున్ముందూ ఇదే జోష్‌తో మిగతా మ్యాచుల్లోనూ ఆడతాం. నేను బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు షార్ట్ లెగ్‌లో ఫీల్డర్‌ను పెట్టిన శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ బాగుంది. నేనెప్పుడూ అలాంటి అనుభవం రుచి చూడలేదు. కెప్టెన్లు దూకుడుగా ఆలోచించడం మంచిదే" అని శ్రేయస్ వెల్లడించాడు.

### శ్రేయస్‌పై రూ.12 లక్షల జరిమానా

ఐపీఎల్ 2026 సీజన్‌లో జరిమానా ఎదుర్కొన్న తొలి కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ నిలిచాడు. తక్కువ ఓవర్‌రేట్ కారణంగా శ్రేయస్‌కు రూ.12 లక్షల జరిమానా విధిస్తూ ఐపీఎల్ కమిటీ నిర్ణయం తీసుకుంది. గుజరాత్ టైటాన్స్‌తో పంజాబ్ తొలుత బౌలింగ్ చేసింది. నిర్ణీత సమయంలోగా ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. దీంతో స్లో ఓవర్ రేట్ కారణంతో ఫైన్ విధిస్తూ ఐపీఎల్ పాలక మండలి ప్రకటన జారీ చేసింది.



## రాణించిన ఓలా ఎలక్ట్రిక్..

ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మళ్లీ పుంజుకొంది. మార్చి నెల చివరి వారంలో రోజుకు సగటున వెయ్యి యూనిట్లు విక్రయించినట్లు కంపెనీ తెలిపింది. మార్చి మొత్తానికి గానూ 10,117 రిజిస్ట్రేషన్లు పూర్తైనట్లు వాహన్ డేటా ప్రకారం తెలుస్తోంది. ఫిబ్రవరి నెలలో ఓలా ఎలక్ట్రిక్ రిజిస్ట్రేషన్ల సంఖ్య 3,973 యూనిట్లతో పోలిస్తే గత నెలలో 150 శాతం వృద్ధి నమోదు కావడం గమనార్హం. ఓలా సర్వీసు సెంటర్ల వద్ద తాత్సారం, విడిభాగాలు లభ్యం కాకపోవడం వంటి కారణాలతో ఓలా సేవల పట్ల వినియోగదారుల్లో అసంతృప్తి నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో మార్కెట్ వాటా పరంగా ఒకప్పుడు అగ్రస్థానంలో ఉన్న ఈ సంస్థ.. తన వాటాను కోల్పోతూ వచ్చింది. ఈ క్రమంలో సర్వీసు సెంటర్లను విస్తరించింది. పనితీరును మెరుగుపరిచింది. సర్వీసింగ్‌కు వచ్చే వాహనాల్లో దాదాపు 80 శాతం అదే రోజు పూర్తి చేసి ఇస్తున్నట్లు ఓలా పేర్కొంది. స్పేర్ పార్టుల లభ్యత పెంచినట్లు ఓలా తెలిపింది. ఓలా ఎలక్ట్రిక్ పట్ల కస్టమర్లలో పెరిగిన విశ్వాసం కారణంగా మార్చి నెల విక్రయాల్లో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. మొ-ంత్తంగా 1 మిలియన్ విక్రయాలు సాధించిన తొలి ఈవీ కంపెనీగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఇదే పనితీరును భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com